www.prajapaksham.in
ప్రజాపక్షం
ప్రతి అక్షరం ప్రజల కోసం
స్తంభాద్రి భద్రాద్రి
గురువారం | 05 | మార్చి | 2026
పేజీలు : 8

రాములోరి కళ్యాణ పనులు షురూ..

కన్నుల పండువగా వసంతోత్సవం, డోలోత్సవం
- స్వామివారి కళ్యాణ తలంబ్రాలు తయారీ
- ప్రత్యేక పూజలు, హారతులు
- వేడుకలో పాల్గొన్న ఎంఎల్ఏ, సర్పంచ్, ఇఓ
- భద్రాద్రిలో మొదలైన పెళ్లి సందడి

2 లో

ముంచుకొస్తున్న నివాస స్థలాల ముప్పు..!

పెరిగిన పట్టణీకరణతో ఇబ్బందులు

నివాస స్థలాల పంపిణీపై దృష్టి సారించని పాలకులు

ప్రజాపక్షం/ఖమ్మం : పట్టణాలు, నగరాలు అనే తేడా లేకుండా నివాస స్థలాల సమస్య ముంచుకొస్తున్నది. రెండు దశాబ్దాల కాలంలో శరవేగంగా జరిగిన పట్టణీకరణ ఈ పరిస్థితికి కారణమైంది. వ్యవసాయ రంగ సంక్షోభం కారణంగా గతంలో ఎన్నడులేనివిధంగా పల్లెల నుంచి పట్టణాలకు వలస ప్రారంభమైంది. ముఖ్యంగా 21వ శతాబ్దంలో పల్లెలు ఖాళీ అయి పట్టణాలు కిక్కిరిసిపోయేందుకు పాలకుల వైఖరి, ప్రకృతి వైపరీత్యాలు, ప్రజల జీవన విధానంలో వచ్చిన మార్పులు

మిగతా 2లో..

కొనసా...గుతున్న విచారణ

- గిరిజనులకు దక్కని న్యాయం ?
- 24 గంటల వైద్యం మాటలేనా?
- నూతన జిల్లా కలెక్టర్ దృష్టి సారించాలి

ప్రజాపక్షం/పాల్వంచ : పాల్వంచలో పేద ఆదివాసీ గిరిజ కుటుంబానికి న్యాయం దక్కేనా? అనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఆసుపత్రిలో 24 గంటల వైద్య సేవలు అంతా బూటకమంటూ, అదంతా ప్రజలను మభ్యపెట్టడానికే అనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి. వారికి జరిగిన అన్యాయంపై సంభంధిత అధికారుల విచారణ నాలు నెలలుగా కొనసా...గుతుండటంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. వివరాల్లోకి వెళితే పాల్వంచ నెహ్రూనగర్‌కు చెందిన నిరుపేద ఆదివాసీ కుటుంబానికి చెందిన కుంజా భవాని తమ స్థాయికి మించి దమ్మపేట ములకలపల్లి రహదారిలో గల విజయా నర్సింగ్ హోంలో గర్భిణి సమయంలో చికిత్స తీసుకొంటున్నది. 24 గంటల వైద్య సదుపాయం ఉందని ఆసుపత్రి వర్గాల మాటలు నమ్మి పురుడు కోసం 2025 నవంబర్ 27వ, తేదీన రాత్రి నాలుగు గంటల సమయంలో ఆసుపత్రికి చేరుకొన్నది. కానీ ఆ సమయంలో చికిత్స అందించటానికి వైద్యులు అందుబాటులో లేక పోవటంతో భవానీకి సిబ్బందే దిక్కయ్యారు. వైద్యులు ఫోన్ ద్వారా ఇస్తున్న సూచనలతో సిబ్బంది చికిత్స అందించారు. తెల్లవారి ఉదయం 8 గంటలకు సదరు వైద్యులు ఆసుపత్రికి చేరుకొని భవానికి వైద్యం అందించి పురుడు పోశారు. అనంతరం జన్మించిన మగబిడ్డ ఆరోగ్య పరిస్థితి తెలుసుకోవాలంటే పిల్లల డాక్టర్‌చే వైద్యం అందించాలంటూ దానికి తగు ఫీజు

మిగతా 2లో..

యథేచ్ఛగా ఇసుక అక్రమ రవాణా

-అధికారులు సహకరిస్తున్నారన్న ఆరోపణలు
-పగలు మంతనాలు.. రాత్రి ఇసుక తోలకాలు

ప్రజాపక్షం/ ఖమ్మం : ఇసుక తరలింపుపై అధికారులు ఎన్ని చర్యలు తీసుకున్నా అక్రమ తరలింపు మాత్రం ఆగడం లేదు. ఇసుకను అక్రమంగా తరలిస్తూ పట్టుబడితే యజమానుల మీద కేసు నమోదు చేస్తాం, డ్రైవర్ల మీద కేసులు నమోదు చేస్తాం, పిడి యాక్ట్‌లు పెడతామంటూ ప్రభుత్వ యంత్రాంగం చేస్తున్న ప్రకటనలలో ఏ మాత్రం పస లేకపోవడంతో అక్రమార్కులు యథేచ్ఛగా రవాణా చేస్తున్నారు. బోనకల్ మండలం బ్రాహ్మణపల్లిలో బుధవారం పట్ట పగలు ఎటువంటి అనుమతులు లేకుండానే ఇసుకను తరలిస్తుంటే పోలీసులకు ఎట్టకేలకు ఓ రెండు ట్రాక్టర్లు దొరికాయి. చింతకాని, బోనకల్ మండలాల్లో ఇసుక అక్రమ రవాణా అధికారుల కనుసన్నల్లోనే జరుగుతుందని అనేక ఏళ్లుగా ఇసుక రవాణాలో అరితేరిన కొందరితో అధికారులు మిత్రుత్వం నడుపుతూ పరోక్ష సహకారం అందిస్తున్నారని ఆరోపణలు వినవస్తున్నాయి. ప్రభుత్వం గుర్తించబడని ఇసుక రీచ్ ల నుంచి ఇసుకను అక్రమంగా తరలిస్తున్నా పట్టించుకోవడం లేదని ఆరోపణలు వినవస్తున్నాయి. కూపన్స్ జరి విషయంలోనూ పెద్ద ఎత్తున

మిగతా 2లో..

ముంచుకొస్తున్న నివాస స్థలాల ముప్పు..!

(మొదటిపేజీ తరువాయి)

కారణమయ్యాయి. మధ్యతరగతి, ఎగువ మధ్యతరగతి, సంపన్న వర్గాలకు పట్టణాల్లో జీవించడం స్టేటస్ సింబల్‌గా మారింది. గ్రామాలను వదిలి పట్టణ బాట పట్టగా వ్యవసాయ రంగంలో వచ్చిన మార్పులు, పెరిగిన యాంత్రీకరణ, గిట్టుబాటు కానీ సాగు, వరుసగా వచ్చిన ప్రకృతి వైపరీత్యాలు గ్రామీణ పేదలను పొట్టచేత పట్టుకుని పట్టణానికి వచ్చేలా చేశాయి. అదే సమయంలో బతుకు దెరువుకు గ్రామీణ ప్రాంతాల కంటే పట్టణ ప్రాంతాల్లో ఎక్కువగా అవకాశాలు ఉండడంతో పేద, దిగువ మధ్యతరగతి ప్రజలకు పట్టణాలకు చేరుకున్నారు. తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా గ్రామీణ ప్రాంత జనాభా కంటే పట్టణ, నగరాల జనాభా ఎక్కువగా పెరుగుతూ వచ్చింది. ఉదాహరణకు ఖమ్మం జిల్లాలో 15 లక్షల జనాభా ఉంటే ఇందులో మూడవ వంతు ఐదు లక్షలకు పైబడిన జనాభా ఒక ఖమ్మం నగరంలోనే జీవిస్తున్నారంటే పరిస్థితి ఏవిధంగా ఉందో అర్థం చేసుకోవచ్చు. బతుకుదెరువు కోసం వచ్చిన దిగువ, మధ్యతరగతి, పేద ప్రజలకు అద్దెలు చెల్లించి జీవించే పరిస్థితి లేదు. కిక్కిరిసిన జనాభా కారణంగా నివాస స్థలాల సమస్య రోజు రోజుకు తీవ్రమవుతుంది. గతంలో ఇండ్ల స్థలాల పంపిణీ కార్యక్రమాన్ని పాలకులే చేపట్టి పేదలకు నివాస స్థలాలు పంపిణీ చేసేవారు. చాలా కాలంగా జాగా లేని నిరుపేదలకు ఇండ్ల స్థలాల పంపిణీ కార్యక్రమం అనేది పూర్తిగా నిలిచిపోయింది.

పెరిగిన రియల్ ఎస్టేట్ వ్యాపారం...

పట్టణాలు, నగరాల చుట్టూ రియల్ ఎస్టేట్ వ్యాపారం విస్తృతమైంది. నగరాలు, పట్టణాల్లో సామాన్యులు వంద గజాల జాగ కొనడం అంత తేలికైంది కాదు. లక్షలు వెచ్చిస్తే తప్ప జాగ దొరికే పరిస్థితి లేదు. దీనితో ప్రభుత్వ స్థలాల ఆక్రమణ జరుగుతుంది. పేదలు ప్రభుత్వ స్థలాలను ఆక్రమించడం కొన్నేళ్ల పాటు వేచి ఉండి ఆ తర్వాత వాటిని కూల్చివేయడం ఈ మధ్య పాలకులకు అలవాటుగా మారింది. నగరాల చుట్టు ఉన్న ప్రభుత్వ భూములను వివిధ సంస్థలకు ప్రభుత్వ సంస్థల ఏర్పాటుకు కేటాయిస్తుండడంతో భవిష్యత్తులో పేదలకు సెంట్ జాగా పంపిణీ చేసే అవకాశం లేకుండాపోయింది. ఇప్పుడు పట్టణాల్లో నివసిస్తున్న పేదలకు ఇండ్ల స్థలాల సమస్య తీవ్రతరం కావడంతో నాలాలపై లేదా ఇతర ప్రభుత్వ భూములను ఆక్రమించి నివాసాలు ఏర్పాటు చేసుకుంటున్నారు. ఇది రాష్ట్ర వ్యాప్తంగా జరుగుతున్న ప్రక్రియ. దీనికి సంబంధించి భూ ఆక్రమణల పేరుతో బుల్‌డోజర్ల సంస్కృతి తీసుకు రావడం పేదలపై భూ ఆక్రమణ కేసులు నమోదు చేయడం చేస్తున్నారు. ఇదే సమయంలో కొందరు దళారులు నివాస స్థలాలను క్రమబద్ధీకరిస్తామని చెబుతూ పేదలను అందిన కాడికి పిండుకునే ప్రయత్నం చేస్తున్నారు.

నివాస స్థలాల పంపిణీకి ప్రత్యేక కార్యాచరణ...

ప్రభుత్వాలు నివాస స్థలాల పంపిణీపై ప్రత్యేక దృష్టి సారించాల్సి ఉంది. ఇందిరమ్మ ఇండ్లు ప్రస్తుతానికి సొంత జాగా ఉన్న వారికి మాత్రమే కేటాయిస్తున్నారు. ఇలా కాకుండా పేదల నివాస స్థలాలకు సంబంధించి ప్రత్యేక కార్యాచరణ చేపట్టాల్సి ఉంది. అనువైన ప్రాంతాలను ఎంపిక చేసి అక్కడ పేదలకు నివాస స్థలాలను కేటాయించి అక్కడే ఇందిరమ్మ ఇండ్లను మంజూరు చేయాల్సి ఉంది. పెరుగుతున్న పట్టణీకరణ నేపథ్యంలో ఇండ్ల స్థలాల సమస్య భవిష్యత్తులో ప్రధాన సమస్యగా మారడంతో పాటు ఆక్రమణలకు, ఆందోళనలకు దారి తీసే అవకాశం ఉంది. దీనిపై ఆలోచన చేయకపోతే పాలకులు ఎవరైనా ఇబ్బందులు ఎదుర్కొనక తప్పదు.

రాములోరి కళ్యాణ పనులు షురూ..

ప్రజాపక్షం/భద్రాచలం : శ్రీ సీతారామ చంద్ర స్వామివారి ఆలయంలో బుధవారం రాములోరి కళ్యాణ పనులు మొదలయ్యాయి. ముందుగా పావన గోదావరి నుండి తీర్థ బిందె ను మేళ తాళాల నడుమ పావన నదీ జలాలను తీసుకొచ్చి సంప్రోక్షణ చేశారు. అనంతరం ఆలయ ప్రాంగణంలో వసంతోత్సవం, డోలోత్సవం కన్నుల పండువగా జరిగింది. ఈనెల 27న జరగనున్న శ్రీ సీతారామచంద్ర స్వామివారి కళ్యాణమహోత్సవానికి ముందు ఫాల్గున శుద్ధ పౌర్ణమి సందర్భంగా బుధవారం నుండి స్వామివారి కళ్యాణానికి సంబంధించిన పనులకు శ్రీకారం చుట్టారు. డోలోత్సవంలో భాగంగా స్వామివారిని ప్రత్యేక ఊయలలో కూర్చుండబెట్టి పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆస్థాన విద్వాంసులు రామదాసు, తూము నర్సింహదాసు కీర్తనలు ఆలపించారు. స్వామికి నక్షత, కుంభ హారతులు సమర్పించారు. హోళీ పౌర్ణమి సందర్భంగా ఆలయ ప్రాంగణంలో వసంతోత్సవం వైభవంగా జరిగింది. ఈ కార్యక్రమంలో భక్తులు అత్యంత భక్తి శ్రద్ధలతో పాల్గొని రంగునీళ్లు చల్లుకుంటూ కేరింతలు కొట్టారు. ముందుగా ప్రధాన ఆలయంలో ధ్రువమూర్తులకు, ఆంజనేయస్వామి, లక్ష్మీ తాయారమ్మ వారికి వసంతోత్సవాన్ని శాస్త్రోక్తంగా చల్లిన అనంతరం భక్తులకు రంగు నీళ్లు చిలుకరించారు. దీంతో రామాలయ ప్రాంగణం సప్తవర్ణ శోభితంగా మారింది.

పసుపు కొమ్ములు దంపి...

పెళ్లి పనులకు శుభ సూచికంగా రోళ్లు, రోకళ్లు సిద్ధం చేసి ఆలయం ప్రాంగణంలో పూజలు నిర్వహించిన అనంతరం పసుపు కొమ్ములను దంపారు. ఇందులో భాగంగా ఎంఎల్‌ఏ డా.తెల్లం వెంకట్రావు, సర్పంచ్ పూనెం కృష్ణ దొరతో పాటు రామాలయం ఇఓ దామోదర్ రావు దంపతులు అర్చకుల దంపతులు, ముత్తదవులు రోకలి పోట్లు వేసి పసుపు తయారీ చేశారు.

సంప్రదాయ తలంబ్రాలు...

తలంబ్రాల తయారీతో రామయ్య పెళ్లి పనులు మొదలైనట్లు అయింది. మొదటిగా 25 క్వింటాళ్ల తలంబ్రాలను కలిపారు. ముస్లీం సంప్రదాయ పద్ధతుల్లో తలంబ్రాల తయారీ సాగింది. శుభ సూచికంగా దంపిన పసుపుతో పాటు కుంకుమ, గులాం, సుగంధ ద్రవ్యాలు కలిపి తలంబ్రాలు సిద్ధం చేశారు. ఈ తలంబ్రాల తయారీ వేడుకలో పాల్గొనేందుకు మహిళలు పోటీ పడ్డారు. కాజుల సవ్వడులతో పసుపు, కుంకుమ వర్ణమైన చేతులను స్వామికి అంకితం చేస్తూ జైశ్రీరాం నినాదాల నడుమ తలంబ్రాల తయారీ సాగింది. శ్రీరామ నవమికి మొత్తం 400 క్వింటాళ్ల తలంబ్రాల తయారీకి రంగం సిద్ధం చేస్తున్నారు.

మొదలైన సందడి...

ఆలయ ప్రాంగణంలో వసంతోత్సవం, డోలోత్సవం, తలంబ్రాల తయారీతో రామయ్య పెళ్లి పనులు మొదలయ్యాయి. ఈనెల 27న శ్రీ రామ నవమి, 28న పట్టాభిషేకం నిర్వహించనుండగా, 19 నుండి వసంత పక్ష ప్రయుక్త నవాహ్నిక శ్రీరామ నవమి తిరుకళ్యాణ బ్రహ్మోత్సవాలు ఘనంగా ప్రారంభం కానున్నాయి.

కొనసా...గుతున్న విచారణ

(మొదటిపేజీ తరువాయి)

మాట్లాకొని నవజాత శిశువు మృతి చెందిన విషయాన్ని దాచి పెట్టి పిల్లల డాక్టర్‌ను పిలిపించారు. వచ్చిన వైద్యులు చికిత్స చేసిన అనంతరం శిశువు మృతి చెందాడంటూ నిర్ధారించారు. అనంతరం నవజాత శిశువును ఖననం చేశారు. అనంతరం బాదితులతో జరిగిన విషయాన్ని ఎవరితో చెప్పొదంటూ ఆసుపత్రి వర్గాలు అనటంతో విషయాన్ని బాదితులు తమ బందువులకు చేరవేశారు. ఆసుపత్రికి చేరుకున్న కుటుంబ సభ్యులు భవానీకి ఆలస్యంగా వైద్యం అందించటంతోనే శిశువు మృతి చెందాడంటూ ఆరోపించారు. ఆసుపత్రి ఎదుట శాంతయుత ఆందోళన చేపట్టారు. సమాచారం అందుకొన్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని ఆందోళన కారులతో మాట్లాడి శాంతింపజేశారు. అనంతరం డిప్యూటీ డిఎంఅండ్‌హెచ్‌ఓ జరిగిన ఘటనపై విచారణ చేపట్టారు. రెండుసార్లు ఆసుపత్రిని తనిఖీ చేశారు. 24 గంటల వైద్య సేవలు లేవని గ్రహించారు. ఆసుపత్రిలో సరైన వైద్య పరికరాలు పని చేయటం లేదని, మృత శిశువు పట్ల అనుసరించాల్సినపద్ధతులను అవలంభించలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ క్రమంలో బాదితులు ఆదివాసీ సంఘాలతో కలిసి, ఆసుపత్రి యాజమాన్యాం పాత్రికేయుల సమావేశాలు నిర్వహించి జరిగిన ఘటనపై వివరణ ఇచ్చుకొన్నారు. ఆసుపత్రికి సరైన సమయంలో రాకపోవటం, గర్భిణీ సరైన చికిత్స తీసుకోలేదంటూ ఆసుపత్రి వర్గాలు ఆరోపించాయి. దీనికి బదులుగా ఆసుపత్రికి వచ్చిన పేషెంట్‌కు సరైన సమయంలో వైద్యం అందించకుండా ఫోన్ ద్వారా సిబ్బందిచే చికిత్స అందించటంతోనే శిశువు మృతిచెందాడంటూ బాదితులు ఆరోపించారు. అనంతరం జిల్లా వైద్యాధికారి తుకారాం రాథోడ్ తనిఖీ చేసి విచారించారు. నివేదకను జిల్లా కలెక్టర్‌కు అందజేశామని దీనిపై నిపుణుల కమిటీని వేసినట్లు చెప్పారు. నాలుగు నెలలుగా విచారణ కొనసాగించటంపై పేద గిరిజన కుటుంబానికి న్యాయం దక్కుతుందా లేదా అనే అనుమానాలు పాల్వంచ వ్యాప్తంగా వ్యక్తమవుతున్నాయి. ఇప్పటికైనా నూతనంగా వచ్చిన జిల్లా కలెక్టర్ దృష్టి సారించి తగు విచారణ చేపట్టి దోషులపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరుచున్నారు.

యథేచ్ఛగా ఇసుక అక్రమ రవాణా

(మొదటిపేజీ తరువాయి)

అక్రమాలు చోటు చేసుకుంటున్నాయని ఇసుక అక్రమ రవాణాకు అలవాటుపడిన కొందరు మండల కార్యాలయాల్లో పెద్ద మొత్తంలో చెల్లించి కూపన్లను పొందుతున్నారని ఆరోపిస్తున్నారు. నిజమైన లబ్దిదారులకు ఇసుక దొరకడం గగనమైపోయిందని కొందరు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇసుక తరలింపు వెనక ఉన్న అధికారులు ఎవరు...? ఏ ఇసుక వ్యాపారులకు చింతకాని, బోనకల్ మండలాల్లో ఉన్న అధికారులు సహకరిస్తున్నారో వారిపై పూర్తి స్థాయిలో విచారణ జరిపి నియంత్రించ గలిగితే అక్రమ ఇసుక రవాణా నిలిచిపోతుందని కొందరు సూచిస్తున్నారు. కొందరు ఇసుక అక్రమ రవాణాదారులు అధికార పార్టీ పేరు చెప్పి అధికారులను తమ వైపుకు తిప్పుకుంటున్నారన్న ఆరోపణలు సైతం వినవస్తున్నాయి. మధిర నియోజక వర్గంలోని ఈ రెండు మండలాల్లో సాగుతున్న ఇసుక అక్రమ రవాణాపై ఉన్నతాధికారులు దృష్టి సారించాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

సిఎంఆర్ రైస్ డెలివరీలో ఇబ్బందులు లేకుండా చర్యలు

ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ : సిఎంఆర్ రైస్ డెలివరీలో ఇబ్బందులు లేకుండా తగు చర్యలు చేపట్టాలని అదనపు కలెక్టర్ పి. శ్రీనివాసరెడ్డి తెలిపారు. కలెక్టరేట్‌లోని కాన్ఫరెన్స్ హాల్‌లో సిఎంఆర్ రైస్ డెలివరీపై గోడౌన్ మేనేజర్‌లు ఎంఎల్ఎస్ పాయింట్ ఇంచార్జీలతో బుధవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ రైస్ మిల్లర్లు, ఎస్‌డబ్ల్యూసిలకు సరఫరా చేసే ఏసికే సకాలంలో దింపేందుకు అవసరమైన మేర హమాలీలను ఏర్పాటు చేయాలన్నారు. సిఎంఆర్ రైస్ డెలివరీ ఆలస్యం కాకుండా రైస్‌మిల్లర్లకు పూర్తి స్థాయిలో సహకరించాలన్నారు. గోడౌన్లకు వచ్చిన స్టాక్ ప్రకారం రైస్ మిల్లర్లకు సరిగ్గా రశీదులు పంపిణీ చేయాలని ఆయన ఆదేశించారు. ఈ సమావేశంలో జిల్లా పౌర సరఫరాల మేనేజర్ శ్రీలత, జిల్లా రైస్ మిల్ సంఘం అధ్యక్షులు బొమ్మ రాజేశ్వరరావు, గోడౌన్ మేనేజర్‌లు, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

లస్కర్ ఉద్యోగాలు ఇప్పిస్తామంటూ డబ్బులు వసూలు

-ఎప్పుడో ముగిసిన లస్కర్ ఉద్యోగాల నియామకం

-నాయకన్‌గూడెంకు చెందిన ఓ లస్కర్ ఘరానా మోసం

-పట్టించుకోని ఐబి శాఖాధికారులు

ప్రజాపక్షం/ కూసుమంచి : నీటిపారుదల శాఖలో అవుట్ సోర్సింగ్ ఉద్యోగాలు ఇప్పిస్తామంటూ కూసుమంచి మండలానికి చెందిన మండలంలోని నాయకన్ గూడెంకు చెందిన ఓ లస్కర్ నిరుద్యోగుల నుండి రూ. 70వేల నుంచి రూ. 90వేలు వసూలు చేసినట్లు విశ్వసనీయ సమాచారం. గతేడాది నవంబర్‌లోనే అవుట్‌సోర్సింగ్ ఉద్యోగాలు ముగిసిపోయినప్పటికీ వాటి గడువు 2026 మార్చి 31తో ముగుస్తున్న నేపథ్యంలో మళ్లీ ఉద్యోగాలు ఇప్పిస్తాను వేచి ఉండండి అంటూ నిరుద్యోగులను మభ్యపెడుతూ ఘరానా మోసానికి పాల్పడిన సంఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. నాయకన్ గూడెంలోని లస్కర్ ఉద్యోగం చేస్తున్న ఓ వ్యక్తి నాకు పై అధికారులు అందరూ తెలుసు నేను ఉద్యోగాలు ఇప్పిస్తానంటూ నిరుద్యోగుల నుండి భారీ మొత్తంలో నగదు వసూళ్లకు పాల్పడి నిరుద్యోగులకు తిరిగి నగదు ఇవ్వకుండా కాలయాపన చేస్తున్నాడని సమాచారం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. ఇంత జరుగుతున్నప్పటికీ సంబంధిత ఇరిగేషన్ శాఖాధికారులు తమకేమి పట్టనట్లుగా ఉండటం శోచనీయం. దీనితో కొందరు నిరుద్యోగులు త్వరలో బహిరంగంగా తమకు జరిగిన అన్యాయాన్ని ఎలుగెత్తే అవకాశాలు కనిపిస్తున్నాయి.

వ్యవసాయ క్షేత్రంలో గుప్తనిధుల తవ్వకాలు

-అవాక్కైన రైతులు

-ఆలస్యంగా వెలుగు చూసిన ఉదంతం

ప్రజాపక్షం/చంద్రుగొండ: చంద్రుగొండలోని ఇద్దరు రైతులకు చెందిన వ్యవసాయ క్షేత్రంలో గుర్తు తెలియని వ్యక్తులు గుప్తనిధుల తవ్వకాలు చేసిన ఉదంతం ఆలస్యంగా బుధవారం వెలుగు చూసింది. ఈ విషయంపై వివరాలు ఇలా ఉన్నాయి. చంద్రుగొండలోని రైతులు మరకాల దుర్గా రెడ్డి, మరకాల కృష్ణారెడ్డి అన్నదమ్ములకు చెందిన వ్యవసాయ క్షేత్రంలో ఈ ఏడాది పత్తి సేద్యం చేశారు. పంట చేను మధ్యలో వేపచెట్టు కింద కాలభైరవ విగ్రహం ఉంది. విగ్రహాన్ని పక్కకు జరిపిన గుర్తు తెలియని వ్యక్తులు పెద్ద ఎత్తున తవ్వకాలు చేశారు. అనంతరం గోతిని పూడ్చేశారు. కొంత కాలం క్రితం జరిగిన ఈ సంఘటన ఆలస్యంగా వెలుగుచూసింది. కాలభైవుడి విగ్రహాన్ని వెలికిల పడేశారు. ఇది గమనించిన రైతులు భయంకంపితులైయ్యారు. ఈఅంశం ఆ నోట ఈ నోట చర్చనీయాంశంగా మారింది. శ్రీనగర్ కాలనీకి సమీపంలో జరిగిన ఈ సంఘటనపై పోలీసులు విచారణ జరిపి నిందితులను శిక్షించాలని బాధిత రైతులు కోరుతున్నారు.

సీతారామయ్యకు ప్రజలగుండెల్లో సుస్థిరస్థానం

సిపిఐ జాతీయ సమితి సభ్యులు బాగం

ప్రజాపక్షం/కొణిజర్ల : గడల సీతారామయ్య నేటికి ప్రజల గుండెల్లో సుస్థిర స్థానం సంపాదించుకున్నాడని సిపిఐ జాతీయ సమితి సభ్యులు బాగం హేమంతరావు, సిపిఐ జిల్లా కార్యదర్శి, సహాయ కార్యదర్శి దండి సురేష్, జమ్ముల జితేందర్‌రెడ్డి అన్నారు. మండల పరిదిలోని తనికెళ్లలో సిపిఐ సీనియర్ నాయకులు తెలంగాణ సాయుధపోరాటాయోధుడు గడల సీతారామయ్య 49వ వర్ధంతి కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా గ్రామశాఖ కార్యదర్శి యాసా వెంకటేశ్వరరావు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో వారు ప్రసంగించారు. తెలంగాణను నిజాం పరిపాలననుంచి, వెట్టిచాకిరీనుంచి విముక్తి చేయడానికి సీతారామయ్యలాంటి నాలుగున్నర వేలమంది తమ ప్రాణాలను అర్పించారని అన్నారు. వారందరి చరిత్రను మనం భావితరాలకు అందించాలని అన్నారు. కమ్యూనిస్టుపార్టీ వందసంవత్సరాల వేడుకను ఖమ్మంలో జరుపుకున్నామని కమ్యూనిస్టులు ఇంకా ఎక్కడున్నారు అనేవారికి మనం సమాధానం చెప్పగలిగామని అన్నారు. ఖమ్మం జిల్లాలో ఎప్పుడు జరగనటువంటి రీతిలో వందసంవత్సరాలు వేడుకను ఘనంగా జరుపుకొని ఇదిగో కమ్యూనిస్టులు ఇక్కడున్నారని గట్టి సమాధానం ఇవ్వగలిగామని తెలిపారు. అమరవీరులు చేసిన త్యాగాలు , కృషి, పోరాటాలతోనే మనం ఈరోజు నిలబడగలిగామని అన్నారు. కమ్యూనిస్టులను బ్రతికించుకోవాలని అన్ని వర్గాల ప్రజలు కోరుకుంటున్నారని ప్రజలు కమ్యూనిస్టుల అవసరాలను గుర్తిస్తున్నారని పేర్కొన్నారు. ఉమ్మడి ఖమ్మం జిల్లాలో కొత్తగూడెం మేయర్ పదవిని చేపట్టగలిగామంటే కమ్యూనిస్టుల అవసరాన్ని ప్రజలు గుర్తించారని స్పష్టం చేశారు. ఈకార్యక్రమంలో తనికెళ్ల గ్రామ సర్పంచ్ గడల కళావతి, సిపిఐ జిల్లా నాయకులు యర్రా బాబు, తాటి వెంకటేశ్వర్లు, పివిరావు, తమ్మిశెట్టి వెంకటేశ్వర్లు, వెంపటి పరశురాములు, మండలపార్టీ కార్యదర్శి గడల భాస్కర్‌రావు, మనిగె కోటేశ్వరరావు, తనికెళ్ల మాజీ సర్పంచ్ గడల సీతారామయ్య, పిన్నం పుల్లయ్య, గడల శ్రీనివాసరావు, చల్లా కృష్ణ, గడల సూర్యనారాయణ, గాజుల వెంకటేశ్వరరావు, యాసా సత్యనారాయణ, తనికెళ్ల గ్రామ ఉప సర్పంచ్ చల్లా నరసింహారావు, మాజీ ఉపసర్పంచ్ చల్లా నరసింహారావు, పాపిట్ల ఏసు, పెదమళ్ల రత్తమయ్య, బాసా వెంకటేశ్వర్లు, లేడిబోయిన సైదులు, బాణోత్ రామయ్య, బెజవాడ రాంబాబు పాల్గొన్నారు.

నిబద్ధత గల కమ్యూనిస్టు ఆవుల బాబు

సిపిఐ జాతీయ సమితి సభ్యులు బాగం

ప్రజాపక్షం/చింతకాని : సీపిఐ కార్యకర్త ఆవుల బాబు బ్రతికినంత కాలం ఎర్ర జెండా ఎత్తుకొని నిబద్ధత గల కమ్యూనిస్టుగా బ్రతికాడని సిపిఐ జాతీయ సమితి సభ్యులు భాగం హేమంతరావు పేర్కొన్నారు. బస్వాపురం గ్రామానికి చెందిన సిపిఐ సీనియర్ నాయకులు ఆవుల బాబు(58) మంగళవారం రాత్రి గుండెపోటుతో మృతిచెందాడు. విషయం తెలుసుకున్న భాగం హేమంతరావు బుధవారం బస్వాపురం చేరుకొని బాబు మృతదేహం పై పార్టీ జెండా కప్పి పూలమాలవేసి నివాళులర్పించారు. ఈసందర్భంగా హేమంతరావు మాట్లాడుతూ బాబు బస్వాపురంలో చిన్నతనం నుంచి పార్టీ పిలుపిచ్చిన ప్రతి కార్యక్రమంలో ముందుండేవాడని గుర్తు చేసుకున్నారు.బాబు కుటుంబానికి పార్టీ ఎల్లవేళలా అండగా ఉంటుందన్నారు. నివాళులర్పించిన వారిలో పార్టీ జిల్లా కార్యదర్శి దండి సురేష్,సహాయ కార్యదర్శి జమ్ముల జితేందర్ రెడ్డి, జిల్లాకార్యవర్గ సభ్యులు తాటి వెంకటేశ్వర్లు, పావులూరి మల్లి ఖార్జునరావు, జిల్లా కౌన్సిల్ సభ్యులు రాసాల మోహన్‌రావు, మండల సహాయ కార్యదర్శి మార్గం శ్రీను, మాజీ ఎంపీపీ కన్నెబోయిన విజయమ్మ , సర్పంచ్ ఆవుల నర్సింహారావు, ఉపసర్పంచ్ చంద్రకాని నర్సింహారావు, మాజీ సర్పంచ్‌లు రాసాల సాంబలక్ష్మి , బొడ్డు సుగుణమ్మ, శాఖ కార్యదర్శి బద్దల నర్సింహారావు, నాయకులు బుర్ర అంజయ్య, బొడ్డు కొండలరావు తదితరులు పాల్గొన్నారు.

ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యం

- ట్యాంక్ బండ్ మరమ్మతులను పరిశీలించిన చైర్‌పర్సన్ సుజాత

ప్రజాపక్షం/ మధిర : ప్రజా సమస్యల పరిష్కారమే మా లక్ష్యమని మున్సిపల్ చైర్‌పర్సన్ సామినేని సుజాత రామనాథం అన్నారు. ట్యాంక్ బండ్ పరిసర ప్రాంతాలు, పిల్లల ఆటల పరికరాలు మరమ్మత్తులకు గురైనట్లు తన దృష్టికి రాగా వెంటనే స్పందించిన చైర్‌పర్సన్ సమస్య పరిష్కారానికి చర్యలు చేపట్టారు. బుధవారం చేపట్టిన అవుట్ డోర్ గేమ్ పరికరాల మరమ్మత్తు పనులను ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా చైర్‌పర్సన్ మాట్లాడుతూ ట్యాంక్ బండ్‌కు వచ్చే ప్రజలకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా ఉండేందుకు పూర్తిస్థాయిలో చర్యలు తీసుకోవటం జరుగుతుందని తెలిపారు. వార్డుల్లో పారిశుద్ధ్య పనుల్లో నిర్లక్ష్యం చేయకుండా సమస్యలకు వెంటనే స్పందించాలని శానిటేషన్ సూపర్వైజర్‌ను, జవాన్‌ను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో 10వ వార్డు కౌన్సిలర్ బోడేపూడి రేవతి, కమీషనర్ సపంత్‌కుమార్, వాకర్స్, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

ఘనంగా లైన్‌మెన్ దినోత్సవం

ప్రజాపక్షం/సత్తుపల్లి: సత్తుపల్లి విద్యుత్ శాఖ అసిస్టెంట్ ఇంజనీరింగ్ కార్యాలయంలో బుధవారం లైన్‌మెన్ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో అసిస్టెంట్ ఇంజనీర్ శరత్ విద్యుత్ సిబ్బందిని శాలువాలు కప్పి, సత్కరించి ప్రశంసాపత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎండనక, వాననక కష్టపడి పనిచేస్తూ ప్రజలకు నిరంతరాయంగా విద్యుత్ సరఫరా అందిస్తున్న లైన్మెన్ సేవలు అభినందనీయమని కొనియాడారు. విద్యుత్ శాఖ సిబ్బంది అంకితభావంతో పని చేయడం వల్లే వినియోగదారులకు మెరుగైన సేవలు అందుతున్నాయని పేర్కొన్నారు. కార్యక్రమంలో లైన్ ఇన్‌స్పెక్టర్లు రవి కిరణ్, కరుణాకర్, పూర్ణ, రాంబాబు, శ్రీనివాసరెడ్డి సిబ్బంది పాల్గొన్నారు.

భద్రత పాటిస్తూ పనిచేస్తాం : ఏఎల్ఎం బలరాం

లైన్మెన్ దినోత్సవం సందర్భంగా మాకు గుర్తింపు ఇవ్వడం ఆనందంగా ఉందని అసిస్టెంట్ లైన్ మెన్ బలరాం తెలిపారు. విద్యుత్ లైన్లలో ప్రవహించే కరెంట్ బయటకు కనిపించదని, అందువల్ల అత్యంత జాగ్రత్తగా పని చేయాల్సి ఉంటుందని అన్నారు. మన మీద ఒక కుటుంబం ఆధారపడి ఉంటుందని గుర్తుంచుకుని ఎప్పుడూ భద్రతా నియమాలు పాటిస్తూ విధులు నిర్వహించాలని సూచించారు. ఫీల్డ్‌లో పనిచేసేటప్పుడు ఎర్త్ రాడ్, వోల్టేజ్ టెస్టర్, గ్లౌజులు వంటి భద్రతా పరికరాలను తప్పనిసరిగా వినియోగించాలన్నారు. అలాగే సిబ్బందిపై పని భారం ఎక్కువగా ఉన్నందున కొత్త నియామకాలు చేపట్టాలని యాజమాన్యాన్ని విజ్ఞప్తి చేశారు.

రేపు జాబ్ మేళా

ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ : ఉమ్మడి ఖమ్మం జిల్లాలోని నిరుద్యోగ యువతీ, యువకులకు ప్రైవేటు రంగం మెడ్‌ప్లస్‌లో ఉద్యోగాలు కల్పించుటకు రేపు జాబ్ మేళా నిర్వహిస్తున్నట్లు జిల్లా ఉపాధి అధికారిణి ఎన్. మాధవి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. మార్చి ఆరున శుక్రవారం ఉదయం 10 గంటలకు మోడల్ కెరీర్ సెంటర్ (ప్రభుత్వ ఐటిఐ టేకులపల్లి) ఖమ్మం నందు జాబ్ మేళా నిర్వహించడం జరుగుతుందన్నారు. మెడ్‌ప్లస్ హైదరాబాద్‌లో ఫార్మసిస్టు ఉద్యోగాలకు ఫార్మసీ (పిసిఐ) అర్హత గల వారు అర్హులని ఎంపికైన వారికి రూ. 19వేల నుంచి రూ. 25వేల వరకు వేతనం ఉంటుందని, సిఎస్ఎ, జూనియర్ అసిస్టెంట్, ఆడిట్ అసిస్టెంట్ ఉద్యోగాలకు ఎస్ఎస్సి, ఇంటర్, ఏదైనా డిగ్రీ గల వారు అర్హులని తెలిపారు. ఎంపికైన వారికి రూ. 12,756 నుంచి రూ. 14,500 వేతనం ఉంటుందని తెలిపారు. మొత్తం 322 ఉద్యోగాల ఖాళీలకు జాబ్ మేళా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ ఉద్యోగ ఖాళీలు హైదరాబాద్‌లో ఉంటాయని ఉచిత వసతి కల్పించనున్నట్లు తెలిపారు. ఆసక్తి, అర్హత గల నిరుద్యోగ యువతీ, యువకులు తమ విద్యార్హతల సర్టిఫికెట్ జిరాక్స్ కాపీలతో జాబ్‌మేళాకు హాజరు కావాలని జిల్లా ఉపాధి అధికారిణి తెలిపారు.

ఘనంగా హోలీ వేడుకలు

ప్రజాపక్షం/రఘునాథపాలెం : రంగుల పండుగగా ప్రసిద్ధి చెందిన హోలీ వేడుకలను రఘునాథపాలెం మండల వ్యాప్తంగా ఘనంగా నిర్వహించారు. బుధవారం హోలీ పండుగ సందర్భంగా పలు గ్రామాల్లో ప్రజలు ఆనందోత్సవాల మధ్య వేడుకలను జరుపుకున్నారు. చిన్నారులు, యువత, మహిళలు అని తేడా లేకుండా ప్రతి ఒక్కరూ రంగులు చల్లుకుంటూ పండుగను సంబురంగా నిర్వహించారు. ఉదయం నుంచే నృత్యాలు చేస్తూ వీధుల వెంట తిరుగుతూ తోటి వారికి రంగులు పూస్తూ ఆనందంగా గడిపారు. కుల మతాలకు అతీతంగా హోలీ పండుగను జరుపుకున్నారు. హోలీ సంబురాల సందర్భంగా తండాలలో అత్యంత ఉత్సహపూరిత వాతావరణం నెలకొంది. డిజె పాటలకు యువత నృత్యాలు చేస్తూ సందడి చేశారు.

ఘనంగా హోలీ వేడుకలు

ప్రజాపక్షం/ఖమ్మంరూరల్ : ఖమ్మంరూరల్ మండలం, ఏదులాపురం మున్సిపాలిటీలో హోలీ వేడుకలను బుధవారం ఘనంగా నిర్వహించారు. ఇందులో భాగంగా చిన్నారులు, యువతీ, యువకులు, పెద్దలు రంగుల చల్లుకొని, డీజే పాటలు పెట్టుకుని నృత్యాలు చేశారు. ఈ సందర్భంగా యువతతో పాటు ఆయా రంగాల్లో పని చేసే కూలీలు వేకువ జాము నుంచే మిత్రులు కుటుంబ సభ్యుల ఇండ్ల వద్దకు వెళ్లి రంగులు చల్లుకున్నారు. అలాగే ఆయా ప్రాంతాలలోని పలు పార్టీల కార్యకర్తలు తమ రాజకీయ పార్టీల నాయకులు, ప్రజా ప్రతనిధులు వద్దకు వెళ్లి హోలీ శుభాకంక్షలు తెలిపారు. సంబరాలలో భాగంగా వాడవాడలు, కాలనీలు రంగురంగుల రంగులతో నిండిపోయాయి. ఐదవ డివిజన్లో బిఆర్ఎస్ నాయకుడు బానోత్ మోహన్ ఆధ్వర్యంలో చేపట్టిన వేడుకలు ఉత్సాహంగా జరిగాయి.

విద్యార్థులకు పరీక్షా ప్యాడ్లు పంపిణీ

ప్రజాపక్షం/సత్తుపల్లి: యువసేవ సమితి ఆధ్వర్యంలోమున్సిపల్ చైర్మన్ రెహానా కమల్ పాషా సహకారంతో అందించిన 1500 పరీక్షా ప్యాడ్ లను ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు రాష్ట్ర కాంగ్రెస్ నాయకులు డా. మట్టా దయానంద్ విజయకుమార్ బుధవారం పంపిణీ చేశారు. అనంతరం డా.మట్టా దయానంద్ మాట్లాడుతూ యువసేవ సమితి నిర్వహిస్తున్న సేవా కార్యక్రమాలు అభినందనీయమని పేర్కొన్నారు. యువత ముందుకు వచ్చి సమాజ సేవలో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. భవిష్యత్తులో ఇలాంటి సేవా కార్యక్రమాలను మరింత విస్తరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ రెహానా కమల్ పాషా, సత్తుపల్లి పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు గాదె చెన్నారావు, యువసేవ సమితి బాధ్యులు జొన్నలగడ్డ రాజు, కాంగ్రెస్ నాయకులు బొంతు వేణు తదితరులు పాల్గొన్నారు.

పది విద్యార్థులకు పరీక్షా సామగ్రి అందజేత



ప్రజాపక్షం/చింతకాని : ప్రొద్దుటూరు గ్రామానికి చెందిన చల్లా బాబురావు జ్ఞాపకార్థం ప్రొద్దుటూరు జిల్లా పరిషత్ హైస్కూల్‌లో పదోతరగతి చదువున్న విద్యార్థులకు పరిక్షా సామాగ్రిని కుటుంబ సభ్యులు పంపిణి చేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ మొగిలి కృష్ణయ్య మాట్లాడుతూ పట్టుదలతో చదివి పాఠశాలకు, గ్రామానికి మంచి పేరు తీసుకురావాలని విద్యార్థులకు సూచించారు. ఈకార్యక్రమంలో మాజీ సర్పంచ్ పెంట్యాల పుల్లయ్య, ఉపసర్పంచ్ గుర్రం చిట్టి , పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు గ్రామస్థులు చల్లా నవీన్ కుమార్, చల్లా వెంకటేశ్వర్లు, చేబ్రోలు రమేష్, పెంట్యాల నాగులమీరా, మందా శేషయ్య, విద్యార్థులు పాల్గొన్నారు.

పోలీసుల హోలీ కేరింతలు

ప్రజాపక్షం/ కొత్తగూడెం : జిల్లా పోలీస్ యంత్రాంగం హోళీ వేడుకల్లో కేరింతలు కొట్టింది. జిల్లా పోలీస్ బాస్ రోహిత్ రాజ్ సిబ్బందితో కలిసి సందడి చేశారు. పోలీస్ హెడ్ క్వార్టర్స్‌లో జరిగిన ఈ వేడుకను ఘనంగా సాగింది. ఎస్‌పితో కలిసి అధికారులంతా హైమచంద్రాపురం పోలీస్ హెడ్ క్వార్టర్స్‌లో మేళ తాళాల నడుమ నృత్యాలు చేశారు. ఈ వేడుకలో భద్రాచలం ఏఎస్‌పి విక్రాంత్ కుమార్ సింగ్, కొత్తగూడెం డిఎస్‌పి ఆదినారాయణ, పాల్వంచ డిఎస్‌పి సతీష్ కుమార్, మణుగూరు డిఎస్‌పి రవీందర్ రెడ్డి, ఇల్లెందు డిఎస్‌పి వెంకన్న బాబు, సిఐలు, ఎస్సైలు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా హోలీ వేడుకలు

ప్రజాపక్షం/కారేపల్లి: కారేపల్లి మండల పరిధిలోని కారేపల్లి క్రాస్ రోడ్డులో బుధవారం హోలీ వేడుకలు ఘనంగా జరుపుకున్నారు. ఉదయం నుండే యువకులు రంగులు చేత పట్టి హోలీ శుభాకాంక్షలు తెలియజేసుకుంటూ ఒకరినొకరు రంగులు పూలుముకుంటూ సందడి చేశారు. మరి కొంత మంది యువకులు కోడిగుడ్లు, ఇంజన్ ఆయిల్ వంటివి తలపై పోసుకుంటూ, గుడ్లను కొట్టుకుంటూ వేడుకలను జరుపుకున్నారు. చిన్న పెద్ద వయసు సంబంధం లేకుండా అనేక మంది ఈ వేడుకలలో పాల్గొని సందడి చేశారు.

సమష్టిగా గ్రామాభివృద్ధికి కృషి చేయాలి

ప్రజాపక్షం/పాల్వంచ : వార్డు సభ్యులు సమష్టిగా పని చేసి గ్రామ పంచాయితీల అభివృద్ధికి కృషి చేయాలని ఎంపిడిఓ బొగ్గా నారాయణ అన్నారు. మండల పరిధి జగన్నాధపురం రైతు వేదికలో గ్రామ పంచాయితీ వార్డు సభ్యులకు 5 రోజుల పాటు జరిగే శిక్షణా శిభిరాన్ని బుధవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎంపిడిఓ మాట్లాడుతూ గ్రామ పంచాయితీలో పాలకవర్గం అయిన సర్పంచ్, వార్డు సభ్యులు వారి విధులను, బాద్యతలను తెలుసుకొని గ్రామాభివృద్ధికి పాటుపడాలని సూచించారు. పంచాయితీకి వచ్చే నిధులు, ప్రభుత్వ పథకాల గురించి పంచాయితీ స్థాయిలో పనిచేసే సిబ్బంది విధులు కూడా తెలిసి ఉండాలన్నారు.పంచాయితీ వార్డు సభ్యులు శిక్షణా తరగతులను సద్వినియోగం చేసుకొని గ్రామ అభివృద్దిలో భాగం కావాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపిఓ చెన్నకేశవులు, ఏపిఓ పోరండ్ల రంగా, శిక్షణా నిఒర్వాహకులు కార్తీక్, ఉదయ్, రాంబాబు, సాంబశివరావు, కార్యదర్శులు మోసెస్ కుమార్, నరేష్, బాబ, నవీన్, పరశురాం, వంశీ, ఎల్. నరేష్ తదితరులు పాల్గొన్నారు.

పాల్వంచలో రేపు జాబ్‌మేళా

ప్రజాపక్షం/పాల్వంచ: హైదరాబాద్‌కు చెందిన ఎక్సలర్ సొల్యుషన్ వారి ఆధ్వర్యంలో నాలుగు కంపెనీలలో ఖాళీగా ఉన్న 100 పోస్టులకు ఈ నెల 6వ, తేదీన పాల్వంచ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో జాబ్‌మేళా నిర్వహిస్తున్నామని జిల్లా ఉపాధి కల్పనాధికారి కే. శ్రీరామ్ బుదవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ అవకాశాన్ని డిగ్రీ, బి. టెక్ చదివుకొన్న జిల్లాలోని 18 నుండి 32 సంవత్సరాల నిరుద్యోగ యువతీ యువకులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఉదయం 10 గంటల నుండి ఇంటర్వ్యూలు జరుగుతాయని అభ్యర్థులు తమ జీరాక్స్ సర్టిఫికెట్‌లతో హాజరు కావాలని సూచించారు. మరిన్ని వివరాల కోసం 9177721034 కు ఫోన్ చేసి తెలుసుకోవాలన్నారు.

పెన్షనర్ల పెండింగ్ బకాయిలను చెల్లించాలి

ప్రజాపక్షం/ బోనకల్ : రిటైర్డ్ ఉద్యోగులు ఉద్యోగ సమయంలో దాచుకున్న సొమ్మును వెంటనే విడుదల చేయాలని పిఆర్‌పిఎ జిల్లా కన్వీనర్ యలమద్ది వెంకటేశ్వర్లు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బుధవారం బోనకల్‌లో జరిగిన విలేకరుల సమావేశంలో వైవి మాట్లాడుతూ ఉద్యోగ విరమణ పొందిన ఉద్యోగులకు ఉద్యోగ సమయంలో దాచుకున్న డబ్బులను వెంటనే విడుదల చేసి వారికున్న సమస్యల నుండి విముక్తి పొందేలా రాష్ట్ర ప్రభుత్వం వెంటనే చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. ఉద్యోగ విరమణ పొంది 23నెలలు గడుస్తున్నప్పటికీ గ్రాట్యూవిటి, కమ్యుటేషన్, జిపిఎఫ్, జిఐఎస్, లీవ్ ఎన్ క్యాష్మెంట్ ఇవ్వకపోవడం వల్ల ఆర్థిక ఇబ్బందులతో ఫెన్షనర్లు తీవ్రంగా మనోవేదన చెందుతున్నారని అన్నారు. పిఆర్సిని వెంటనే ప్రకటించి బకాయిలో ఉన్న డిఎలను విడుదల చేయాలని కోరారు. తక్షణమే రాష్ట్ర ప్రభుత్వం ఈ విషయంపై ప్రత్యేక శ్రద్ధ చూపి ఫెన్షనర్స్ పడుతున్న ఆర్థిక బాధల నుంచి వెంటనే విముక్తి చెందేలా చర్యలు చేపట్టాలని ప్రభుత్వాన్ని కోరారు. ఈసమావేశంలో డి.శివ, నారాయణరెడ్డి పాల్గొన్నారు.

ఖమ్మంలో ఘనంగా రంగోత్సవ్

ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ : ఖమ్మం నగరంలో హోలీ సందర్భంగా రంగోత్సవ్ వేడుకలు అంబరాన్ని అంటాయి. బుధవారం ఖమ్మం నగరంలోని పెవిలియన్ మైదానంలో టిఆర్ఆర్ ఆర్థో ఆక్సిడెంట్ కేర్, పలు సంస్థల సౌజన్యంతో రంగోత్సవ్ మేళాను ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకల్లో వేలాది మంది యువతీ, యువకులు ఉత్సాహంగా పాల్గొన్నారు. రంగోత్సవ్‌లో ప్రత్యేక ఆకర్షణగా జబర్ధస్త్ టీమ్ నిలిచింది. ఆట పాటలతో తీరొక్క రంగులతో పెవిలియన్ మైదానం రంగులమయమైంది. ఒకరికొకరు శుభాకాంక్షలు తెలుపుకుంటూ సరదాగా సందడి చేశారు. రసాయనాలు లేని ప్రకృతి సిద్దమైన రంగులతో హోలీని సంబురంగా నిర్వహించారు. ఈ వేడుకల్లో పాల్గొన్న ప్రతి ఒక్కరికి హోలీ శుభాకాంక్షలు తెలిపారు. జబర్ధస్థ్ ప్రేమ్ ఆటపాలతో సందడి చేశారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ నాయకులు తోట రామారావు, డాక్టర్ తోట లక్ష్మణ్, తోట రమేష్, కోటయ్య, కిషన్‌నాయక్, మహేందర్, రవీందర్, వీరేందర్, మోతె కుమార్, స్థానికులు పాల్గొన్నారు.

చాంబర్ ఆఫ్ కామర్స్‌లో :

చాంబర్ ఆఫ్ కామర్స్ కార్యాలయం నందు హోలీ వేడుకలు అంబురాన్ని అంటాయి. అన్ని రకాల వ్యాపార వర్గాలు చిన్న, పెద్ద అనే తేడా లేకుండా ఈ వేడుకల్లో పాల్గొని ఆనందంగా రంగులు పులుముకుంటూ చిందులు వేశారు. ఒకరికొకరు శుభాకాంక్షలు తెలుపుకున్నారు. ఈ వేడుకల్లో అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కురువెళ్ల ప్రవీణ్‌కుమార్, సోమా నర్సింహారావు (జివై నరేష్), ఉపాధ్యక్షులు బత్తిని నర్సింహారావు, సెంట్రల్ ఈసి మెంబర్లు మాటేటి కిరణ్‌కుమార్, రాయపూడి రవి కుమార్, వంగవీటి హరీష్, సూకాసి శేషగిరిరావు, పోట్ల రామనాథం, కార్యవర్గ సభ్యులు, అన్ని శాఖల అధ్యక్ష, కార్యదర్శులు, సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి పనుల్లో ఫేసియల్ అటెండెన్స్

-సాంకేతిక కారణాలతో ఇబ్బందులు

ప్రజాపక్షం/ రఘునాథపాలెం : కేంద్ర ప్రభుత్వం మహత్మ గాంధీ జాతీయ ఉపాధి హామీ పథకంలో భారీ మార్పులకు శ్రీకారం చుట్టింది. అందులో భాగంగా ఇప్పటికే ఈ పథకం పేరును వికసిత్ భారత్ గ్యారెంటీ ఫర్ రోజ్ ఘర్ అండ్ అజీవిక మిషన్ గ్రామీణ్ పథకం (విబి జి రామ్ జీ)గా మార్చింది. ఉపాధి పనులకు సంబంధించి కూలీల హాజరులో అవకతవకలను నిరోధించేందుకు ప్రత్యేకంగా ఫేసియల్ అథంటికేషన్ అటెండెన్స్ (ముఖ హాజరు) విధానాన్ని ప్రవేశపెట్టింది. మార్చి రెండు నుంచి దేశ వ్యాప్తంగా ఉపాధి పనుల్లో దీనిని అమలు పరుస్తున్నారు. ఫెసియల్ అటెండెన్స్ విధానంలో ప్రతి కూలీకి ఒక ఐడి నెంబర్‌ను కేటాయించి పనికి వచ్చిన ఉదయం సమయంలో కూలీలను విడిగా ఫోటో తీసి యాప్‌లో ఫీల్డ్ అసిస్టెంట్లు, టిఏలు అప్‌లోడ్ చేయాలి. ఆ తర్వాత పని ప్రారంభించి నాలుగు గంటల అనంతరం పని ముగించుకుని ఇంటికి వెళ్లే సమయంలో మరో మారు పనిచేసిన కూలీలంతా గ్రూపుగా ఫోటో దింపి ఆన్‌లైన్‌లో నమోదు చేయాలి. పని ప్రారంభ సమయంలో కూలీలను విడివిడిగా నాలుగు గంటల అనంతరం పని ముగిసిన తర్వాత గ్రూపుగా ఫోటో దింపి ఆన్‌లైన్‌లో నమోదు చేస్తేనే హాజరు నమోదయ్యేవిధంగా ప్రభుత్వం చర్యలు చేపట్టింది. జాబ్‌కార్డులో పేరు ఉన్న ప్రతి కూలీ ఈకెవైసి చేయించుకుంటేనే ఫెసియల్ అటెండెన్స్‌కు అవకాశం ఉంటుంది. కానీ ఈవిధానం వల్ల పలు సాంకేతిక సమస్యలు ఎదురవుతున్నాయని కూలీలు వాపోతున్నారు. ఫోటో తీసి యాప్‌లో నమోదు చేసే సమయంలో ఇంటర్‌నెట్ సరిగ్గా లేకపోవడం వల్ల నమోదు కావడం లేదని, రెండు మార్లు ఫోటో తీసి నమోదు చేయాల్సి ఉంటుందని ఏ ఒక్కటి అప్‌లోడ్ కాకపోయినా ఆ రోజు హాజరు ఉండదని దీనితో తాము తీవ్రంగా నష్టపోతున్నామని కూలీలు వాపోతున్నారు. వేపకుంట్ల గ్రామ పంచాయతీలో సాంకేతిక కారణాల వల్ల పలువురి కూలీల ఫోటోలు యాప్‌లో అప్‌లోడ్ కాకపోవడంతో పనికి వచ్చి పని చేయకుండానే తిరిగి వెళ్లిపోయారు. నూతన విధానాన్ని తీసివేసి పాత పద్దతిలోనే హాజరు నమోదును చేపట్టాలని కూలీలు కోరుతున్నారు.

హోలీ సంబరాలు రెండు దినాలు

ప్రజాపక్షం/జూలూరుపాడు: హోలీ తేదీ గత సంవత్సరం లాగే ఈ సారికూడా చాలా మందిలో గందరగోళాన్ని సృష్టించింది. హోలీ పండుగను హిందూ చాంద్రమాన క్యాలెండర్ ప్రకారం జరుపు కుంటారు. స్థిర ఆంగ్ల క్యాలెండర్ ప్రకారం కాదు. హోలీ పండుగ ఫాల్గుణ మాసంలో పౌర్ణమి రోజున వస్తుంది. చంద్ర క్యాలెండర్ చంద్ర చక్రాలపై ఆధార పడి ఉంటుంది కాబట్టి, తేదీలు ప్రతి సంవత్సరం మారుతూ ఉంటాయి. పూర్ణిమ తిథి సమయం, దాని ప్రారంభ, ముగింపు గంటలు వేడుక యొక్క ఖచ్చితమైన రోజును నిర్ణయించడంలో ప్రధాన పాత్ర పోషిస్తాయి. అందరితో కలిసి రంగులు చల్లుకునే సరదా పండుగ హోలీ ఈ సారి మంగళ వారం కొందరు జరుపుకోగా చాలామంది 4న జరుపుకోవాలని నిర్ణయించుకున్నారు. మార్చి 3న సంపూర్ణ చంద్రగ్రహణం ఏర్పడింది. గ్రహణానికి 9 గంటల ముందే (ఉదయం 6:30 నుంచి) సూతకం ప్రారంభమ వడంతో సూతక కాలంలో ఆలయాల్లో పూజలు నిలిపివేశారు. ఇలాంటి సమయంలో ఎలాంటి పండుగ వేడుకలు జరపకూడని కొందరు పండితులు చెప్పడంతో కొందరు మంగళవారం వేడుకలకు దూరంగా ఉన్నారు. ఎటువంటి దోషం లేకుండా ఉన్న మార్చి 4, బుధవారం నాడు జరుపుకోవడం ఉత్తమం అని సూచించడంతో కొందరు బుధవారంకు సిద్ధంమై హోలీ జరుపుకున్నారు.

- గ్రామాల్లో హోలీ వేడుకలు....

గ్రామాల్లో హోళీ పండుగ వేడుకలు మంగళవారం, బుధవారం రెండు రోజులు ఘనంగా నిర్వహించడం జరిగింది. మహిళలు, యువకులు చిన్నారులతో కలిసి ఉత్సహంగా, సంతోషంగా హోళీ వేడుకలు నిర్వహించడం జరిగింది. హోళీ సందర్భంగా నాయకులు మండల ప్రజలందరికీ హోళీ పండుగ శుభా కాంక్షలు తెలిపారు.

పెన్షనర్లు ఉద్యమాలకు సిద్ధం కావాలి

-ఉపాధ్యాయ, ఉద్యోగులు బాసటగా నిలవాలి
-ఎస్‌జిపిఏటి జిల్లా అధ్యక్షులు పరిశ పుల్లయ్య

ప్రజాపక్షం/ ఖమ్మం : రాష్ట్ర ప్రభుత్వ పెన్షనర్లు తమకు రావాల్సిన ఉద్యోగ విరమణ బకాయిలకై ఉద్యమానికి సిద్ధం కావాలని, పెన్షనర్లు చేసే ఉద్యమానికి ఉపాధ్యాయ ఉద్యోగులు బాసటగా నిలవాలని, ఎస్‌జిపిఏటి ఖమ్మం జిల్లా అధ్యక్షులు పరిశ పుల్లయ్య పెన్షనర్లకు పిలుపునిచ్చారు. కృషి భవన్‌లో రాష్ట్ర ప్రభుత్వ పెన్షనర్ల సంఘం ముఖ్య కార్యకర్తల సమావేశం బుధవారం జరిగింది. ఈ సమావేశంలో పరిశ పుల్లయ్య మాట్లాడుతూ పెన్షనర్ల ఉద్యోగ, విరమణ బకాయిలు, ఇతర సమస్యల పట్ల ప్రభుత్వ నిర్లిప్త వైఖరి శోచనీయమన్నారు. ఉద్యోగ విరమణ బకాయిల కోసం రాష్ట్ర ప్రభుత్వ పెన్షనర్ల ఉద్యమాలకు ఉపాధ్యాయ, ఉద్యోగ సంఘాలు బాసటగా నిలవాలని పుల్లయ్య కోరారు. రానున్న రాష్ట్ర బడ్జెట్‌లో పెన్షనర్ల బకాయిలకై ప్రత్యేకంగా రూ. 20వేల కోట్లు కేటాయించాలన్నారు. పెన్షనర్ల కోసం ప్రత్యేకంగా డైరెక్టరేట్ ఏర్పాటు చేయాలని, మార్కెట్ కమిటీ, గ్రంథాలయ పెన్షనర్లకు ట్రెజరీ ద్వారా పెన్షన్లు చెల్లించాలని ఎస్‌జిపిఏటి రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తున్నట్లు పుల్లయ్య తెలిపారు. పదుల సంఖ్యలో పెన్షనర్ల వరుస మరణాలకు కూడా రాష్ట్ర ప్రభుత్వం స్పందించకపోవడం బాధాకరమన్నారు. ఇప్పటికైనా పెన్షనర్ల సమస్యల పట్ల ప్రభుత్వం నిర్లిప్త వైఖరి మార్చుకోవాలన్నారు. పెండింగ్ డిఆర్‌ను పెన్షనర్లకు ఏక మొత్తంగా చెల్లించాలన్నారు. పిఆర్‌సిని సత్వరం ప్రకటించాలని తమ సంఘం కోరుతున్నట్లు పరిశ పుల్లయ్య తెలిపారు. ఈ సమావేశంలో జిల్లా ప్రధాన కార్యదర్శి రాయల రవికుమార్, అసోసియేట్ అధ్యక్షులు కనపర్తి వెంకటేశ్వర్లు, మహిళా కార్యదర్శి బోజెడ్ల కృష్ణమూర్తి, కార్యదర్శులు రాధాకృష్ణ, ప్రసాదరావు, నాగప్రసాద్, హుస్సేన్, సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

కొత్త పిఆర్‌సి ఇవ్వకుండా అడ్డుకోవడమే విద్యా కమిషన్ రిపోర్ట్ ఉద్దేశం

-టిజిటిటిఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు ఇస్లావత్ లక్ష్మణ్ నాయక్

ప్రజాపక్షం/కారేపల్లి: కొత్త పిఆర్‌సి ఇవ్వకుండా అడ్డుకోవడమే విద్యా కమిషన్ రిపోర్ట్ ఉద్దేశమని టిజిటిటిఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు ఇస్లావత్ లక్ష్మణ్ నాయక్ మండిపడ్డారు. బుధవారం మండల కేంద్రంలో మీడియాతో మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వానికి అకునూరి మురళి విద్యా కమిషన్ ఛైర్మన్ నివేదించిన రిపోర్ట్‌ను పరిశీలిస్తే ఉద్యోగ ఉపాధ్యాయులను అవమానించినట్టుగా ఉందన్నారు. వాస్తవ వాస్తవాలను పరిగణలోకి తీసుకోకుండా ప్రభుత్వ ఉపాధ్యాయుల జీతాలపై ఉపాధ్యాయ అర్హతలపై అశాస్త్రీయమైన నివేదిక రాష్ట్ర ప్రభుత్వానికి ఇవ్వడాన్ని తప్పుబట్టారు. అకునూరి మురళి మీద అపారమైన గౌరవం ఉందని, ఇప్పటికే ఉపాధ్యాయులకు సర్వీస్ రూల్ లేక మండల, జిల్లా స్థాయి పర్యవేక్షణ పోస్టులన్ని ఖాళీగా ఉండి ఇంచార్జ్‌తో నడుస్తున్నాయన్నారు. ఒక వైపు డిఈఓ ఆఫీసులో 5 నుండి ఆరు గురు ఉపాధ్యాయులు ఫారిన్ సర్వీస్ మీద డిప్యూటేషన్ దానికి తోడు ఈ మధ్యకాలంలో ప్రతి పాఠశాలలో ప్యానెట్ ఇన్స్పెక్షన్ పేరిట జిల్లాకు సుమారు 50 మందిని పూర్తి స్థాయిలో డిప్యూటేషన్ ఇచ్చి పాఠశాలకు దూరం చేయడం వంటివి చేస్తున్నారని, ఇలా రెగ్యులర్ ఉపాధ్యాయులను డిప్యూటేషన్‌పై పంపడంలో ఉద్దేశం ఏంటన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా సుమారు 1700 మంది ఉపాధ్యాయులు డిప్యూటేషన్ మీద ఉంటే పేద విద్యార్థులకు చదువు ఎలా వస్తుందన్నారు. వాస్తవ వాస్తవాలు తెలుసుకోకుండా నివేదిక ఇవ్వడం సరికాదని అన్నారు.

పరుగుమందులు పిచికారీ చేసేటప్పుడు జాగ్రత్తలు పాటించాలి

ప్రజాపక్షం/కూసుమంచి: రైతులు పురుగుల మందులు పిచికారి చేసేటప్పుడు తగిన జాగ్రత్తలను తీసుకోవాలని జిల్లా వ్యవసాయ అధికారి పుల్లయ్య అన్నారు. బుధవారం కూసుమంచి గ్రామంలో ఆయన రైతులకు పలు జాగ్రత్తలను సూచించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ పురుగు మందులు పచికారి చేసే సమయంలో చేతులకు గ్లౌజులు, కళ్ళకు కళ్ళద్దాలు, ముక్కు, నోరు కప్పి ఉంచేలా మాస్క్, బట్టల పైన ఓవర్ కోటు వంటివి ధరించి పురుగు మందును పిచికారి చేయడం వల్ల ఆరోగ్యాన్ని కాపాడుకోవచ్చని, పురుగుమందుల వాడే విషయంలో పురుగుమందుల డబ్బాలపై ఎరుపు, పసుపు, నీలం, ఆకు పచ్చ రంగులో ఉండే గుర్తులను పట్టి అవి ఏ మోతాదులో విష పూరిత మైనవో ఉంటుందని, కావున పంటలో చీడపీడల తీవ్రతను బట్టి పురుగు మందులను ఎంచుకోవాలని సూచించారు. కూసుమంచి గ్రామంలో కన్నెబోయిన సురేష్ అనే రైతుతో సేఫ్ యూస్ ఆఫ్ పెస్టిసైడ్స్ కిట్‌ను ధరింపజేసిన పురుగుమందులు పిచికారీ చేయించారు. అనంతరం రైతులకు పురుగుమందుల పిచికారి విషయాలను తీసుకోవాల్సిన జాగ్రత్తలపై కరపత్రాలను అందించారు. ఈకార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి రామడుగు వాణి, ఏఈవో జానీ బాబా, రైతులు పాల్గొన్నారు.

ఇంటర్ తరువాత...
పాల్వంచ ప్రభుత్వ అటానమస్ డిగ్రీ కళాశాలలో చేరండి

ప్రజాపక్షం/పాల్వంచ : ఉన్నత విద్యవైపు విద్యార్థులను ప్రోత్సహించాలనే ఉద్దేశ్యంతో పాల్వంచ ప్రభుత్వ అటానమస్ డిగ్రీ కళాశాల అధ్యాపకులు ప్రత్యేక అడ్మిషన్ క్యాంపెనింగ్ బుధవారం నిర్వహించారు. వివిధ కేంద్రాలలో ఇంటర్ మీడియెట్ ద్వితీయ సంవత్సరం పరీక్షలు రాస్తున్న విద్యార్థులను కలిశారు. ఈ సంధర్భంగా ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో కల్పిస్తున్న వివిధ ఆధునిక సదుపాయాలను, అందుబాటులో ఉన్న కోర్సులను వివరించారు. కరపత్రాలను పంపిణి చేశారు. ఈ సంధర్భంగా అడ్మిషన్స్ కన్వీనర్ డి. రమేష్ మాట్లాడుతూ ప్రభుత్వం విధించిన పలు పరీక్షలలో ఉత్తీర్ణులైన, నిష్ణాతులైన, అనుభవం కలిగిన ఉపాధ్యాయులు కలిగిన పాల్వంచ ప్రభుత్వ అటానమస్ డిగ్రీ కళాశాలలో అడ్మిషన్ అయితే నాణ్యమైన విద్య లభిస్తుందని చెప్పారు. మారుతున్న కాలానికి అనుగుణంగా విద్యా బోధన చేపడుతున్నామన్నారు. ముఖ్యంగా ఈ విద్యా సంవత్సరం నుండి బయోటెక్నాలజీ, హెల్త్‌కేర్, బాక్సింగ్ ఫైనాన్స్ అండ్ ఇన్వెస్ట్‌మెంట్ సిస్టమ్ వంటి నైపుణ్యాభివృద్ధి కోర్సులను ప్రవేశపెట్టడం జరిగిందన్నారు. దీనితో విద్యార్థులకు ఉజ్వల భవిష్యత్ ఉంటుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ కో ఆర్డినేటర్ వేముల కామేశ్వరరావు, ఎన్. శ్రీదేవి, పొట్లపువ్వు శ్రీనివాసరావు, పవన్, రమేష్, బాబ్జి, ధర్మారావు, బి. రమేష్, విమల, హారిక, లీల, తేజస్విని, భాను, ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

కోమటిరెడ్డి మోహన్‌రెడ్డి ఆకస్మిక మృతి

ప్రజాపక్షం/బూర్గంపాడు: సారపాక మేనేజర్ గ్రామ పంచాయితీలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు కోమటిరెడ్డి మోహన్‌రెడ్డి గుండెపోటుతో ఆకస్మికంగా మృతి చెందడం స్థానిక ప్రజలను తీవ్ర విషాదంలోకి నెట్టింది. ఈ విషయం తెలిపిన వెంటనే సిపిఐ నాయకులు వారి నివాసానికి చేరుకుని భౌతికకాయానికి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. ఈసందర్భంగా సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు మువ్వ వెంకటేశ్వర్లు(లడ్డా), సిపిఐ జిల్లా సమితి సభ్యులు పేరాల శ్రీనివాసరావు, ఏఐటియూసి మండల అధ్యక్షులు ఎండి సాజిద్, సిపిఐ సీనియర్ నాయకులు సాల్వీర్ జనార్ధన్ మాట్లాడుతూ మోహన్‌రెడ్డి ఎంతో చురుకైన నాయకుడని, ప్రజా సమస్యలు ఎక్కడ ఉన్నా అక్కడికి వెళ్లి పరిష్కారం కోసం కృషి చేసేవారని గుర్తు చేశారు. నిత్యం ప్రజల కోసం పని చేసిన ఆయన మరణం కుటుంబ సభ్యులకు మాత్రమే కాకుండా గ్రామ పంచాయితీ ప్రజలందరికీ తీరని లోటని పేర్కొన్నారు. మోహన్‌రెడ్డి కుటుంబ సభ్యులకు సిపిఐ నాయకులు తమ ప్రగాఢ సంతాసాన్ని తెలిపారు.

ఉద్యమకారుల హామీలు అమలు చేయాలి

ప్రజాపక్షం/బూర్గంపాడు: తెలంగాణ ఉద్యమకారులకు కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని కోరుతూ బూర్గంపాడు మండలంలోని ఉద్యమకారులు తహసీల్దార్‌కు వినతి పత్రం అందించారు. ఈసందర్భంగా ఉద్యమకారుల సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షులు మామిడి పుల్లారావు, సీనియర్ నాయకులు పొడియం నరేందర్‌లు మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఉద్యమకారులకు హామీ ఇచ్చిన 250 గజాల ఇళ్ల స్థలం, పింఛన్, గుర్తింపు కార్డులు, వివిధ ప్రభుత్వ సంక్షేమ పథకాలను తక్షణమే అమలు చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. తెలంగాణ రాష్ట్ర సాధనలో కీలకపాత్ర పోషించిన ఉద్యమకారుల సంక్షేమం పట్ల ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించాలని, ఆలస్యం చేయకుండా నిర్ణయాలు తీసుకోవాలని వారు విజ్ఞప్తి చేశారు. ఉద్యమకారులకు న్యాయం జరిగే వరకు తమ పోరాటం కొనసాగుతుందన్నారు. ఈకార్యక్రమంలో బూర్గంపాడు మండలంలోని పలువురు తెలంగాణ ఉద్యమకారులు పాల్గొన్నారు.

హోలీ వేళ.. ఆధ్యాత్మిక వాతావరణం

ప్రజాపక్షం/బూర్గంపాడు: హోలీ పర్వదినం సందర్భంగా నాగినేనిప్రోలురెడ్డిపాలెంలో వేంచేసి ఉన్న ఎదుర్కోలు శ్రీ వెంకటేశ్వర స్వామి ఆలయంలో భక్తి శ్రద్ధలతో ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఆలయ నిర్మాణదాతలైన బూసిరెడ్డి శంకర్‌రెడ్డి, అన్నపూర్ణ దంపతులు స్వామివారి ఎదుర్కోలు మండపానికి రంగులు వేయించి, ఆలయ పరిసరాలను శుద్ధి చేయించారు. అనంతరం స్వామి వారికి జలాభిషేకం, పంచామృతాభిషేకం ఘనంగా నిర్వహించారు. హోలీ పండుగ సందర్భంగా నిర్వహించిన ఈ ఆధ్యాత్మిక కార్యక్రమం గ్రామంలో భక్తి భావాన్ని మరింత పెంపొందించింది. ఈసందర్భంగా బూసిరెడ్డి శంకర్‌రెడ్డి మాట్లాడుతూ ఇప్పటి నుండి ప్రతి శనివారం స్వామివారికి అభిషేకం నిర్వహించబడుతుందని ప్రకటించారు. భక్తులు పెద్ద సంఖ్యలో హాజరై పూజా కార్యక్రమాల్లో పాల్గొని స్వామివారి ఆశీర్వాదాలు పొందాలని కోరారు. ఈకార్యక్రమంలో పూజారి హనుమంతరావు, దౌపాటి రామకృష్ణ, కుందురు పెద్దిరెడ్డి, దేపంగి రామచందర్, కుందురు ప్రతాప్‌రెడ్డి, కంది మోహన్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు. గ్రామ ప్రజలు దాతలను అభినందిస్తూ వారి సేవా భావాన్ని కొనియాడారు.

ఇరాన్‌పై అమెరికా, ఇజ్రాయిల్ దాడిని ఖండించాలి

ప్రజాపక్షం/కారేపల్లి: ఇరాన్‌పై అమెరికా, ఇజ్రాయిల్ చేపట్టిన దాడులను తీవ్రంగా ఖండిస్తున్నామని ట్రేడ్ యూనియన్ సెంటర్ ఆఫ్ ఇండియా (టియుసిఐ) జిల్లా కార్య దర్శి జి రామయ్య అన్నారు. బుధవారం మాదారం స్టీల్ ప్లాంట్‌లో పనిచేస్తున్న కాంట్రాక్ట్ కార్మికుల జనరల్ బాడీ సమావేశంలో ఆయన మాట్లాడారు. పశ్చిమ ఆసియాపై ఆధిపత్యం, ఆయిలల్ వనరుల కోసం జరుగుతున్న యుద్ధమే తప్ప ఇది మరేదీ కాదని ఆయన విమర్శించారు. ప్రపంచ పోలీసుగా వ్యవహరిస్తూ పేద దేశాలపై దాడులు చేయటం అమెరికా ఆపాడాలని కార్మిక వర్గం గళమెత్తాలని పిలుపునిచ్చారు. ఇరాన్ అధ్యక్షుని హత్య దుర్మార్గమని, చిన్న పిల్లలపై బాంబులు దాడులు వెంటనే నిలిపివేయాలని డిమాండ్ చేశారు. ఈ యుద్ధం కారణంగా నిత్యావసర వస్తువుల ధరలు పెరిగే ప్రమాదం ఉందని, కువైట్ ప్రాంతాల్లో పనిచేస్తున్న అనేక మంది భారతీయ కార్మికులు భయాందోళనల్లో జీవిస్తున్నారని తెలిపారు. ముఖ్యంగా తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ ప్రాంతాలకు చెందిన తెలుగు ప్రజలను సురక్షితంగా స్వదేశానికి తీసుకురావడానికి కేంద్ర ప్రభుత్వం తక్షణ చర్యలు తీసుకోవాలని కోరారు. అంతర్జాతీయ సంస్థలు జోక్యం చేసుకుని శాంతి స్థాపనకు చచర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. ఇరాన్ ప్రజలకు సంఘీభావం తెలిపాలని టియుసిఐ నాయకులు పేర్కొన్నారు. ఈ సమావేశంలో టియుసిఐ నాయకులు కైరుద్దీన్, వీరు, ఇబ్రహీం, సుమన్, లక్ష్మణ్, సంతు తదితరులు పాల్గొన్నారు.

సిపిఎంను బలహీనపరిచేందుకే అసత్య ప్రచారం

-కమ్యూనిస్టులను బలహీనపర్చడమే లక్ష్యంగా ఓ వర్గం మీడియా

-సిపిఎం నేత పోతినేని

ప్రజాపక్షం/ఖమ్మం : సిపిఎంను బలహీనపరిచేందుకు కొన్ని శక్తులు అసత్య ప్రచారానికి పూనుకున్నాయని ప్రజలు ఇటువంటి అసత్య ప్రచారాలను నమ్మవద్దని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు పోతినేని సుదర్శన్ తెలిపారు. కమ్యూనిస్టు పార్టీలలో అంతర్గత చర్చలు సహజమని వ్యక్తిగత అభిప్రాయాలు, సమిష్టి నిర్ణయమన్న నిర్మాణ సూత్రానికి కట్టుబడి సిపిఎం పని చేస్తుందని ఆయన తెలిపారు. రెండు రోజులుగా మీడియాలో సిపిఎం కేంద్ర కమిటీ సభ్యులు తమ్మినేని వీరభద్రం లక్ష్యంగా సాగుతున్న అసత్యప్రచారాన్ని ఆయన తీవ్రంగా ఖండించారు. సిపిఎంలో ఏవో గ్రూపులు ఉన్నాయని, బలహీనపడుతుందంటూ లక్షలాది మంది సిపిఎం అభిమానులను తప్పుదారి పట్టించే ప్రయత్నం జరుగుతుందన్నారు. తమ్మినేని గత కొంత కాలంగా అనారోగ్యంతో బాధపడుతున్నారని వైద్యులు నాలుగు మాసాల పాటు పూర్తి విశ్రాంతి అవసరమని చెప్పినందునే ఆయన విశ్రాంతి తీసుకుంటున్నారని తిరిగి క్రియాశీలక రాజకీయాల్లో ఆయన పాల్గొంటారని సుదర్శన్ స్పష్టం చేశారు. గత కొంత కాలంగా దేశం, రాష్ట్రంలో కమ్యూనిస్టులను బలహీనపరిచేందుకు ఓ వర్గం మీడియా విశ్వ ప్రయత్నం చేస్తుందని ఆయన ఆరోపించారు. దీని వెనక కమ్యూనిస్టు వ్యతిరేక శక్తులు ఉన్నాయని ప్రజలు గమనించాలని ఆయన కోరారు. సిపిఎం వర్గ ధృక్పథం కలిగిన పార్టీ అని పేదలు, కార్మికులు, బడుగు, బలహీన వర్గాల పక్షాన పని చేస్తుందన్నారు. పార్టీలో అంతర్గత చర్చలు సహజమని ఆయన తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న వేలాది మంది సభ్యులు ఎటువంటి అపోహలకు గురికావద్దని సిపిఎం లక్ష్యం దిశగా పని చేస్తుందన్నారు. పాలకులు ఎవరైనా ప్రజా సమస్యల పరిష్కారానికే సిపిఎం కృషి చేస్తుందని భవిష్యత్తులోనూ అదే జరుగుతుందన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా బలమైన శాఖలు కలిగి నిరంతర కార్యాచరణలో ఉన్న పార్టీని బదనాం చేయాలనుకునే శక్తులకు సిపిఎం పురోగమనమే సమాధానం ఇస్తుందని సుదర్శన్ తెలిపారు.

డంపింగ్ యార్డుకోసం దళితుల భూములు లాక్కోవద్దు



ప్రజాపక్షం/కొణిజర్ల : డంపింగ్ యార్డుకోసం దళితుల భూములు గుంజుకోవడం విరమించుకోవాలని కొణిజర్ల మాజీ ఎంపిపి, జెడ్పీటిసి యర్రా బాబు అన్నారు. ఈవిషయంపై దుద్దెపూడి రైతులతో కలిసి కొణిజర్ల తహశీల్దార్ కు బుధవారం వినతిపత్రం అందజేశారు. ఈసందర్భంగా బాబు మాట్లాడుతు మండల పరిధిలోని దుద్దెపూడి గ్రామరెవిన్యూ పరిధిలో సర్వేనెంబర్ 81, 82 లో గ్రామానికి చెందిన దళితులు అమర్లపూడి పెద్ద రోశయ్య, చిన్న రోశయ్య, అమర్లపూడి దేవయ్య, గుజ్జర్లపూడి శేషయ్య, కలక జయప్రకాశం, కలక కాంతయ్యలకు రెండు ఎకరముల భూమి ఉన్నదని అన్నారు. అట్టిభూమిని పశువుల మేతకు, ఇతర అవసరాలకు తరాలనుంచి ఉపయోగించుకుంటు వారి స్వాధీనములోనే ఉన్నదని అన్నారు. అట్టి భూమిని వారి వారుసులైన అమర్లపూడి భాస్కర్‌రావు, రవి, అమర్లపూడి రమేష్, గుజ్జర్లపూడి రామయ్య నేటివరకు వారే పశువుల మేతకు ఉపయోగించుకుంటున్నారు. ఇటీవల అధికారులు ప్రభుత్వ సబ్‌స్టేషన్ నిర్మాణం కోసం ప్రయత్నం చేయగా బాదితులు హైకోర్టును ఆశ్రయించారని ప్రస్తుతం ఈ భూమి కేసు కోర్టులో పెండింగ్‌గా ఉన్నదని అన్నారు. కోర్టులో ఉన్న భూమిని రెవిన్యూ, వైరా మున్సిపల్ అధికారులు డంపింగ్ యార్డు కోసం పరిశీలించడాన్ని ఆయన తప్పుపట్టారు. కోర్టులో పెండింగ్ ఉన్న భూమిని డంపింగ్ యార్డుకోసం ఎలా పరిశీలిస్తారని ప్రశ్నించారు. ఇప్పటికై అధికారులు పేదల భూమి జోలికి పోకుండా ప్రత్యామ్నాయ ఏర్పాటు చేయాలని పేర్కొన్నారు. అమాయక దళితుల భూములను భయపెట్టి గుంజుకోవాలని చూడొద్దని అన్నారు. ఇప్పటికే భూదాన్ భూముల్లో ప్రభుత్వం అభాసుపాలైందని కొణిజర్ల మండలంలో అలాకాకుండా అధికారులు చూడాలని హితవు పలికారు. ఈకార్యక్రమంలో సిపిఐ వైరా మండల కార్యదర్శి యామాల గోపాల్‌రావు, అమర్లపూడి అనిల్, నల్లమోతు సురేష్, అమర్లపూడి రూబెన్, తేజ, రామయ్య తదితరులు పాల్గొన్నారు.

నంబూరు మధు సేవలు చిరస్మరణీయం

ప్రజాపక్షం/వైరా: వైరా లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో బుదవారం నంబూరి మధుసూదన్‌రావు జయంతి వేడుకలు నిర్వహించారు. అనంతరం ప్రభుత్వ ఆసుపత్రి నందు రోగులకు పండ్లు, బ్రెడ్స్, మజ్జిగ ప్యాకెట్లను అందించారు. ఈ సందర్భంగా రీజియన్ చైర్మన్ చలువాది నగేష్, లయన్స్ కంటి హాస్పిటల్ నిర్వాహకులు వుంద్రు శ్యామ్‌బాబు మాట్లాడుతూ సేవా సిద్ధాంతాలను ఆచరణలోకి తేవాలని ఉద్దేశ్యంతో లయనిజంలో ప్రవేశించిన మధు అంచలంచెలుగా ఎదిగి జోన్ చైర్మన్ రీజియన్ చైర్మన్ వంటి బాధ్యతలు నిర్తర్తించి అనేక ప్రతిష్టాత్మక అవార్డులు అందుకున్నారని వారు అన్నారు. గొప్ప సేవా చరిత్ర కలిగిన నంబూరు మధుమన మధ్య లేకపోవడం నిజంగా అత్యంత బాధాకరమని కాని, వారి సేవలు వారి ఆశయాలు ఎప్పటికీ నిలిచే ఉంటాయని వారన్నారు. వారి పవిత్ర ఆత్మకు శాంతి చేకూరాలని మనస్ఫూర్తిగా ప్రార్థిస్తున్నామని తెలిపారు. ఆయన సేవ స్ఫూర్తి ఎందరికో ఆదర్శనీయుమని వుంద్రు శ్యామ్ బాబు తెలిపారు. వారితో గడిపిన క్షణాలను లయన్స్‌క్లబ్ సభ్యులు గుర్తు చేసుకున్నారు. అనంతరం ఎంబిబిఎస్ నాల్గో సంవత్సరం చదువుతున్న మాధురికి రూ.10వేలను మున్సిపాల్ చైర్మన్ డాక్టర్ కాపా చంద్రకళ, లగడపాటి ప్రభాకర్‌రావు అందించారు. ఈ జయంతి వేడుకల్లో జోన్ చైర్మన్ చింతోజు నాగేశ్వరరావు, లయన్స్‌క్లబ్ అధ్యక్షులు వై.బుచ్చిరామారావు, కోశాధికారి గద్దె నీరజ, లయన్స్‌క్లబ్ సీనియర్ సభ్యులు డాక్టర్ పెరుమాల్ల కృష్ణమూర్తి, క్లబ్ మహిళా కోఆర్డినేటర్ మాదినేని సునీత, నూకల శ్రీనివాసరావు, నూకల ప్రసాదరావు, రాయపూడి వెంకటేష్, కొల్లా రాంబాబు, నంబూరి శ్రీనివాసరావు, మిట్టపల్లి వెంకటరమణ, నంబూరి రామారావు, ముళ్ళపాటి సీతారాములు, సుగ్గల మాధవి, కాటేపల్లి రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

పురుగు మందులు, ఎరువుల దుకాణాల పరిశీలన

ప్రజాపక్షం/కూసుమంచి: మండల పరిధిలోని కూసుమంచి, పాలేరు, నరసింహులగూడెం, కోక్యాతండా, నేలపట్ల గ్రామాలలోని పురుగు మందులు, ఎరువుల దుకాణాలను జిల్లా వ్యవసాయ అధికారి పుల్లయ్య పరిశీలించారు. లైసెన్సులను, ఓ ఫారంలను పరిశీలించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఫర్టిలైజర్ బుకింగ్ ఆప్ ద్వారా రైతులు యూరియా కొనుగోలు చేయాలని, యాప్ వాడటంలో ఇబ్బందులు ఉంటే వ్యవసాయ శాఖ ఏఈఓలను సంప్రదించాలని సూచించారు. డీలర్లు అందరూ పీసీలను, ఓ ఫారంలను జతపరచాలని సూచించారు. రైతులకు మరి అవసరాలకు తగినంత యూరియా జిల్లాలో అందుబాటులో ఉందని తెలియజేశారు. ఈసందర్భంగా జిల్లా వ్యవసాయ శాఖ అధికారి వెంట కూసుమంచి మండల వ్యవసాయ శాఖ అధికారి రామడుగు వాణి, తదితరులు పాల్గొన్నారు.

సాహితి ఆడపడుచులకు అభినందన సత్కారం

ప్రజాపక్షం/ ఖమ్మం : శ్రీశ్రీ కళావేదిక విజయవాడ, సవ్యసాచి గ్రూప్ ఆఫ్ ఇండియా సంయుక్త ఆధ్వర్యంలో సాహితి ఆడపడుచులను ఘనంగా సన్మానించారు. వికాస వేదిక సాహిత్య సంస్థ జిల్లా సహాయ కార్యదర్శి కాళంగి వసంతకు 2026 సంవత్సరానికి గాను మహిళ ప్రత్యేక అవార్డు, కీర్తి రత్నను కత్తిమండప ప్రతాప్, ఈశ్వరి, భూషణం, దేవిక రాణి చేతుల మీదుగా అందజేశారు. అదేవిధంగా వికాస వేదిక సాహిత్య సంస్థ జిల్లా అధ్యక్షులు గాజుల భారతి శ్రీనివాస్‌కు సైతం ప్రత్యేక అవార్డును అందజేశారు.ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ మహిళలు సాహిత్య రంగంలో రాణించడం, సమకాలిన సమస్యలపైన సాహిత్యాన్ని తీసుకు రావడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో వికాస వేదిక సాహిత్య సంస్థ రాష్ట్ర అధ్యక్షులు సాధనాల వెంకటస్వామి నాయుడు, కార్యదర్శి, ప్రజాకవి లెనిన్ శ్రీనివాస్, సంస్థ బాధ్యులు సత్యనారాయణ, శ్రీనివాస్, కాంతేశ్వరరావు, జయవాసు, కోంపెల్లి రామయ్య, శైలజ, వసంత, మధు, గుడిసె రాజశేఖర్, హుస్సేన్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా శాంతినగర్ పాఠశాల వార్షికోత్సవం

ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ : ఖమ్మం నగరంలోని శాంతి నగర్ ఉన్నత పాఠశాల 99వ వార్షికోత్సవ వేడుకలను బుధవారం ఘనంగా నిర్వహించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు చల్లగాని కృపాబాలనందం అధ్యక్షతన జరిగిన ఈ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయులు పాఠశాల చరిత్రను వివరించారు. ఉపాధ్యాయుల సహకారంతో విద్యార్థులు సాధించిన ప్రగతిని వివరించారు. ఈ పాఠశాలలో చదివిన ఎంతో మంది విద్యార్థులు వివిధ హోదాల్లో నిలిచారన్నారు. అర్బన్ ఎంతఎవో శైలజ, కార్పొరేటర్ కమర్తపు మురళి చేతుల మీదుగా వివిధ పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు ప్రదానం చేశారు. విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. ఈ కార్యక్రమంలో ఆశాకు మారి, విజయరాజు, ఆఫీస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

మొక్కజొన్న రైతులను ప్రభుత్వం ఆదుకోవాలి

ప్రజాపక్షం/ బోనకల్ : మధిర నియోజకవర్గ వ్యాప్తంగా మార్క్‌ఫెడ్ ద్వారా మొక్కజొన్న కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసి రైతులను ఆదుకోవాలని సిపిఎం మధిర డివిజన్ కార్యదర్శి మడిపల్లి గోపాలరావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బుధవారం స్థానిక పార్టీ కార్యాలయంలో బంధం శ్రీనివాసరావు అధ్యక్షతన సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇటీవల కురిసిన అకాల వర్షాలతో మొక్కజొన్న రైతులు తీవ్రంగా నష్టపోయారని తెలిపారు. లేనిపక్షంలో సిపిఎం పార్టీ ఆధ్వర్యంలో రైతుల తరుపున ఆందోళన కార్యక్రమాలు చేపడుతామని హెచ్చరించారు. ఈసమావేశంలో సిపిఎం జిల్లా సీనియర్ నాయకులు చింతలచెర్వు కోటేశ్వరరావు, జిల్లా కమిటీ సభ్యులు దొండపాటి నాగేశ్వరరావు, మండల కార్యదర్శి కిలారు సురేష్, మండల కమిటీ సభ్యులు గుగులోతు నరేష్ తదితరులు పాల్గొన్నారు.

చైర్మన్, వైస్ చైర్మన్‌కు సన్మానం

ప్రజాపక్షం/వైరా: వైరా మున్సిపాలిటీ పరిధిలోని మెప్మా ఆర్పీల రివ్యూ మీటింగ్ బుదవారం మున్సిపల్ కార్యాలయంలో జరిగింది. ఈ సందర్భంగా మెప్మా వెంకటేశ్వరరావు, ఆర్పీలు నూతనంగా బాధ్యతలు చేపట్టిన మున్సిపల్ చైర్‌పర్సన్ కాపా చంద్రకళ, వైస్ చైర్మన్‌కు కట్ల సంతోష్ వారు శాలువా కప్పి ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా చైర్‌పర్సన్ డాక్టర్ కాపా చంద్రకళ మాట్లాడుతూ మెప్మా సిబ్బంది, ఆర్పీలు ద్వాక్రా సంఘాల అభివృద్ధికి మరింత కృషి చేయాలని ఇందిరమ్మ పాలనలో మహిళల అభివృద్ధి ధ్యేయంగా పాలన కొనసాగుతుందని వారు అన్నారు. ఈ కార్యక్రమంలో పలు ఆర్పీలు పాల్గొన్నారు.

కౌన్సిలర్ నల్లమోతు శైలజ, సురేష్ దంపతులకు సన్మానం

ప్రజాపక్షం/వైరా: వైరా మున్సిపాలిటీ అయ్యప్పస్వామి ఆలయం సమీపంలోని ఉన్న వేద పాఠశాలలో దిద్దుపుడి 15వ వార్డు సమీపంలోని ఉన్న వేద పాఠశాలలో దిద్దుపుడి 15వ వార్డు నల్లమోతు శైలజ సురేష్ దంపతులను సత్యసాయి సేవా సమితి తరపున వేద పండితులు వేద వచనాల ఆశీర్వచనాలతో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో పలువురు వేద పాఠశాల అర్చకులు పాల్గొన్నారు.

99 రోజుల కార్యాచరణ సమర్ధవంతంగా అమలు చేయాలి

- కలెక్టర్ అంకిత్

ప్రజాపక్షం/ కొత్తగూడెం : జిల్లాలో ప్రజాపాలన ప్రణాళికలో భాగంగా చేపట్టనున్న 99 రోజుల కార్యచరణ సమర్ధవంతంగా, సమన్వయంతో అమలు చేసి విజయవంతం చేయాలని జిల్లా కలెక్టర్ అంకిత్ అధికారులను ఆదేశించారు. బుధవారం ఐడిఓసి కార్యాలయం సమావేశ మందిరంలో అదనపు కలెక్టర్ వేణుగోపాలరావుతో కలిసి ముందుగా జిల్లా అధికారులతో సమగ్ర దిశా నిర్ధేశం చేశారు. అనంతరం జిల్లా అధికారులు, ఎంపిడిఓలు, తహశిల్దార్లు, ఎంపిఓలు, మున్సిపల్ కమీషనర్లు, వార్డు అధికారులు తదితరులతో కలిసి వీడియో కాన్ఫిరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ మార్చి 6 నుండి 15వ తేది వరకు పరిసరాల పరిశుభ్రత, ప్రభుత్వ కార్యాలయాల్లో ఫైళ్ల పరిష్కరణ, కార్యాలయ పరిశుభ్రత, పెండింగ్ ఫైళ్ల వేగవంతమైన పరిష్కారం, రికార్డుల సక్రమ నిర్వహణ, ప్రజలలకు సమయానుకూల సేవలు అందించడమే లక్ష్యంగా ప్రత్యేక చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. గ్రామాలు, మున్సిపాలిటీలలో తడిపొడి చెత్త వేరు, సేకరణ, పిచ్చిమొక్కల తొలగింపు, బహిరంగ ప్రదేశాల్లో చెత్త నిర్మూలన, ప్రభుత్వభవనాల శుభ్రత కార్యక్రమాలు విస్తృతంగా చేపట్టాలని సూచించారు. ఏప్రిల్ 6 నుండి 11 వరకు ఆరోగ్య ఆరోగ్య కరమైన ప్రారంభాలు, అశాజనకమైన భవిష్యత్తులు, అంశంపై ఆరోగ్య, కుటుంబ సంక్షేమశాఖ, మహిళ శిశు సంక్షేమశాఖల ఆధ్వర్యంలో ఆరోగ్య శిబిరాలు, వైద్య పరీక్షలు, గర్భిణీలు, చిన్నారులకు ప్రత్యేక పర్యవేక్షణ, పోషకాహార అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని తెలిపారు. ఏప్రిల్ 13 నుండి 18 వరకు అరైవ్ అండ్ అలైవ్ క్రింద రోడ్డు భద్రతపై అవగాహన, 20 నుండి 25 వరకు సంక్షేమ అంశాలు, ఇందిరమ్మ ఇళ్ల పరిస్థితి. పథకాల ప్రయోజనాలు, 27 నుండి మే 2 వరకు పిల్లల భద్రత, రక్షణ, డ్రగ్స్ నిర్మూలనపై అవగాహన కార్యక్రమాలు, 4 నుండి 9 వరకు రైతులకు సాగు సలహాలు, 11 నుండి 16 వరకు పాఠశాలల మౌళిక వసతులు, పరిశుభ్రత, విద్యార్థుల హాజరు, 18 నుండి 23 వరకు యువజన క్రీడలు, మే 25 నుండి 30 వరకు మహిళా సాదికారిత, జూన్ 1 నుండి 12 వరకు పర్యావరణ అంశం, పచ్చదనం, ప్లాస్టిక్ నియంత్రణ కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. ఈ 99రోజుల కార్యాచరణ జిల్లా వ్యాప్తంగా అన్ని గ్రామాల్లో ఐదు దశల్లో అమలు చేయాలన్నారు. కార్యక్రమాల విజయ వంతానికి అన్ని శాఖల అధికారులు సిబ్బందితో కలిసి ముందుకు సాగాలని ఆదేశించారు. ఈ సమావేశంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ విద్యాచందన, జెడ్పి సిఇఓ నాగలక్ష్మి, సిపిఓ సంజీవ రావు, వ్యవసాయాధికారి బాబూరావుతో పాటు ప్రేమ్ కుమార్, త్రినాథ్ బాబు, తిరుమలేష్, నాగేశ్వరరావు, విజయలక్ష్మి, శ్రీ లత తదితరులు పాల్గొన్నారు.

మామిడి రైతులు అప్రమత్తంగా ఉండాలి

ప్రజాపక్ష/కూసుమంచి: మామిడి పంట ప్రస్తుతం జొన్న గింజి, బటాని గింజ దశలో ఉన్నందున రైతులు సస్యరక్షణ చర్యలు తప్పని సరిగా చేపట్టాలని పాలేరు డివిజన్ ఉద్యాన శాఖ అధికారి పి అపర్ణ సూచించారు. ఈ దశలో తెగుళ్లు, తేనెమంచు పురుగు ఉధృతి పెరిగే అవకాశమున్నందున తోటలను క్రమంగా తప్పకుండా పరిశీలించాలని తెలిపారు. నల్ల మచ్చ తెగులు కనిపించినట్లయితే కార్బన్డిజం 1 గ్రాము లీటర్ నీటిలో కలిపి లేదా కార్బన్డిజం+మాంకోజెబ్ 2 గ్రాములు లీటర్ నీటిలో కలిపి పిచికారీ చేయాలని సూచించారు. తేనెమందు పురుగు అధికంగా ఉన్నట్లయితే ఇమిడాక్లోప్రిడ్ 0.3మిలీ లేదా థయోమిథాక్సమ్ 0.4 గ్రాములు లీటర్ నీటిలో కలిపి పిచికారీ చేయాలన్నారు. పిందెలు అధికంగా రాలుతున్న సందర్భంలో ప్లానోఫిక్స్ 4.5 మిలీని 25 లీటర్ల



నీటిలో కలిపి పిచికారి చేయడం వల్ల ప్రయోజనం ఉంటుందని పేర్కొన్నారు. మందుల మోతాదులను ఖచ్చితంగా పాటిస్తూ ఉదయం లేదా సాయంత్రం వేళల్లో పిచికారీ చేయాలని రైతులకు సూచించారు.

పనికి తగిన ప్రతిఫలం దక్కాలి

-సింగరేణి వీవోఏల నూతన సంఘం ఏర్పాటు



ప్రజాపక్షం/కారేపలి : గ్రామాలలో సంఘాల బలోపేతం, మహిళల అర్థికాభివృద్ధి కృషి చేస్తున్న గ్రామ సమాఖ్య సహాయకుల(వీవోఏ)కు పనికి తగిన ప్రతిఫలం దక్కడం లేదని వీవోఏల సంఘం మండల అధ్యక్ష, కార్యదర్శులు బొడ్డుపల్లి వసంత, ఈసం నాగమణిలు ఆవేదన వ్యక్తం చేశారు. బుధవారం కారేపల్లిలో సింగరేణి మండల వీవోఏలు కొత్తగా సంఘాన్ని ఏర్పాటు చేసుకున్నారు. ఈసందర్భంగా జరిగిన సమావేశంలో వారు మాట్లాడుతూ సంఘం ద్వారా వీవోఏల సమస్యలు పరిష్కారంకు కృషి చేయడంతో పాటు సెర్ప్ ప్రాజెక్ట్ ద్వారా ఇచ్చే ఆదేశాలను వెంటనే అమలు చేయటానికి కృషి చేస్తామన్నారు. వీవోఏలకు ప్రభుత్వమే పూర్తి వేతనాలు చెల్లించాలని కోరారు. అనంతరం నూతన కమిటీని ఎన్నుకున్నారు. సంఘం అధ్యక్షురాలిగా బొడ్డుపల్లి వసంత, కార్యదర్శిగా ఈసం నాగమణి, కోశాధికారిగా చీకూర్తి సుజాతలను ఎన్నుకున్నారు. అనంతరం సంఘ బాధ్యులు సింగరేణి మండల ఐకేపీ ఏపీఎం పిడమర్తి వెంకటేశ్వర్లుకు వినతి పత్రం అందజేశారు. ఈకార్యక్రమంలో సంఘం నాయకురాళ్లు పీ మమత, బీ సింధుజ, వై కళ్యాణి, పి రమాదేవి, జీ మోహన్, టీ లలిత, కే వెంకటేశ్వర్లు, కే మంగతాయి, ఎన్ అనూష, సీహెచ్ లక్ష్మి, పీ బాలకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

అనుమానాస్పదంగా లారీ డ్రైవర్ మృతి

ప్రజాపక్షం/సత్తుపల్లి: అనుమానాస్పదంగా లారీ డ్రైవర్ మృతి చెందిన సంఘటన సత్తుపల్లి పట్టణం వెంగళరావు నగర్ లో బుధవారం చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... సత్తుపల్లి మున్సిపాలిటీ పరిధిలోని వెంగళరావు నగర్ కాలనీ రోడ్ నెంబర్ 7 కు చెందిన కొల్లిపర మల్లికార్జున్ (25) లారీ డ్రైవర్ గా పనిచేస్తూ జీవనం కొనసాగిస్తుండగా బుధవారం ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఫ్యాన్ కు ఉరి వేసుకుని మృతి చెందినట్లు పోలీసులకు సమాచారం రావడంతో అక్కడికి చేరుకున్న పోలీసులు అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం సత్తుపల్లి ప్రభుత్వాసుపత్రికి తరలించారు, మృతుడికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. ఇదిలా

ఉండగా భార్యభర్తల మధ్య మనస్పర్థలు ఉన్నాయని, గత కొన్నిరోజుల క్రితం భార్య ఓ యువకుడితో వెళ్ళిపోయి రావటం, పెద్దల సమక్షంలో పంచాయితీ జరగటం, తనకు భర్తని వద్దని పెద్ద మనుషుల ముందు భార్య చెప్పటం, మల్లిఖార్జున్ ఉరి వేసుకున్న సమయంలో భార్య ఇంట్లోనే ఉండి భర్త ఉరేసుకుని చనిపోయాడని చెబుతూ వెళ్ళిపోయినట్లు స్థానికులు చెప్తున్నారు. హత్య, ఆత్మహత్య అనేది పోలీసుల విచారణలో తేలాల్సి ఉంది. అక్రమ సంబందాల మోజులో పచ్చని సంసారాలు చిన్నాభిన్నమవుతున్నాయి. ముక్కుపచ్చలారని చిన్నారులు సైతం తల్లిదండ్రులు చేస్తున్న తప్పులకు అనాధలుగా మారుతున్నారు. రెండు నిమిషాల సుఖం కోసం కట్టుకున్న వాడిని కాదనుకుంటున్నారు కొందరు మహిళలు, పురుషులు.

గిరిమాల్‌లో పోస్టులకు ఇంటర్వ్యూలు

ప్రజాపక్షం/భద్రాచలం : ఐటిడిఏ ఆధ్వర్యంలో త్వరలో ప్రారంభించనున్న గిరిమాల్‌లో ఉద్యోగాల కోసం ఐటిడిఏ ఓపిఓ జనరల్ డేవిజ్ రాజు బుధవారం ఇంటర్వ్యూలు నిర్వహించారు. సేల్స్ అసోసియేట్, క్యాషియర్, స్టాక్ అసిస్టెంట్ పోస్టుల భర్తీ కోసం నిర్వహించిన ఈ ఇంటర్వ్యూకు మొత్తం 15 మంది స్థానిక యువతీయువకులు హాజరయ్యారు. అభ్యర్థుల అనుభవం, అర్హతల ఆధారంగా ఎంపిక చేస్తామని అధికారులు తెలిపారు. ఆసక్తి గల వారు ఐటిడిఏ ప్రాంగణంలోని భవిత్ సెల్‌లో సంప్రదించాలని ఏపిఓ సూచించారు.

ఎల్ఎల్‌బి సీటు సాధించిన విద్యార్థికి ప్రోత్సాహకం

ప్రజాపక్షం/భద్రాచలం : నిరుపేద కుటుంబంలో పుట్టి పెరిగి, ప్రభుత్వ పాఠశాలల్లో కష్టపడి చదువుకుని ఢిల్లీ యూనివర్సిటీలో పూనెం ప్రదీప్ ఎల్ఎల్‌బి సీటు సాధించడం అభినందనీయమని ఐటిడిఏ పిఓ రాహుల్ అన్నారు. హరీష్‌కు ప్రోత్సాహకంగా ఐటిడిఏ ద్వారా రూ.30వేల నగదును చెక్కు రూపంలో ఆయన తండ్రి లక్ష్మయ్యకు అందజేస్తున్నట్లు చెప్పారు. ఇఈ కార్యక్రమలో సహాయ ప్రాజెక్టు అధికారి డేవిడ్ రాజ్ పాల్గొన్నారు.

వ్యక్తిపై కత్తితో దాడి

కేసు నమోదు రిమాండ్

ప్రజాపక్షం/తిరుమలాయపాలెం : మండల పరిధిలోని బీరోలు గ్రామానికి చెందిన కుదూరు ఉదయ్ ని మంగళవారం సాయంత్రం 6 గంటల సమయంలో బీరోలు గ్రామంలోని కమ్యూనిటీ హాల్ ఎదుట ఉన్న వ్యక్తిని తీసుకున్న డబ్బులు ఇవ్వకుండా వేరే వ్యక్తులతో తిరుగుతున్నాడని ఉద్దేశంతో కుదూరు ఉదయ్ పై అదే గ్రామానికి చెందిన మిర్యాల విక్రమ్ రెడ్డి, వేల్పుల లింగరాజు, కట్ల మహేష్ తమ వెంట తెచ్చుకున్న పదునైన కత్తితో ఉద్దేశిపురుకంగా దాడి చేశారని ఉదయ్ తండ్రి లాలూ ఇచ్చిన ఫిర్యాదు ఎస్ఐ కూచిపూడి జగదీష్ విచారణ చేపట్టి కత్తిపోటుకు గాయపడిన కొదూరు ఉదయ్ స్టేట్మెంట్ రికార్డ్ చేసి హత్య ప్రయత్నం కింద కేసు నమోదు చేసి కోర్టులో హాజరు పరిచి రిమాండ్ కు తరలించినట్లు స్థానిక ఎస్సై కూచిపూడి జగదీష్ తెలిపారు. కత్తిపోటుకు గాయపడిన ఉదయ్ ని చికిత్స నిమిత్తం ఖమ్మం తరలించి చికిత్స అందిస్తున్నామని ప్రస్తుతం ఉదయ్ పరిస్థితి నిలకడగా ఉందని కుటుంబ సభ్యులు తెలిపారు.

మొక్కజొన్న పంట పరిశీలన

ప్రజాపక్షం/కూసుమంచి: మండల పరిధిలోని జుజ్జులరావుపేట గ్రామంలో మొక్కజొన్న పంటను జిల్లా వ్యవసాయ అధికారి పుల్లయ్య బుధవారం సందర్శించారు. ఈసందర్భంగా ఆయన రైతులతో మాట్లాడుతూ మొక్కజొన్నలో కత్తెర పురుగు ఆశించిందని ఈ పురుగు నివారణకు ఎమామెక్టిన్ బెంజోయేట్ 5ఎస్‌జీ 80 గ్రాములు ఎకరానికి లేదా నోవాల్యూరాన్ 10ఈసీ300 గ్రాములు ఎకరానికి చొప్పున పిచికారి చేయాలని సూచించారు. అనంతరం కూసుమంచి గ్రామంలో వాలంటీర్ల ద్వారా జరుగుతున్న డిజిటల్ క్రాప్ బుకింగ్ సర్వేను పరిశీలించారు. ఈ సర్వేను త్వరితగతిన పూర్తి చేయాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి రామడుగు వాణి, ఏఈవోలు జానీ బాబా, నవీన్, రవీందర్, రైతులు పాల్గొన్నారు.

నేత్రదానం

ప్రజాపక్షం/వైరా: లయన్స్‌క్లబ్ వైరా వారి ఆధ్వర్యంలో బుదవారం మరణించిన బండారు నాగమణి రెండు కళ్ళను ఖమ్మం నేత్రనిధి వారి ఆధ్వర్యంలో సేకరించి వాటిని భద్రపరిచి హైదరాబాద్ పంపించి వాటిని మరొక ఇద్దరికి కంటి చూపుని ఇచ్చేవిధంగా పంపించడమైనంది. కార్యక్రమంలో పాల్గొన్న 13వ వార్డు కౌన్సిలర్ ముళ్ళపాటి మహాలక్ష్మి సీతారాములు, మాజీ మున్సిపాలిటీ చైర్మన్ సూతకాని జైపాల్, ఆర్యవైశ్య నాయకులు మిట్టపల్లి నాగి, సిపిఎం నాయకులు బొంతు రాంబాబు తదితరులు పాల్గొని మాట్లాడుతూ రీజన్ సెక్రటరీ పెనుగొండ ఉపేంద్రరావు ఇటువంటి కార్యక్రమాలను ప్రోత్సహిస్తున్నారని, కళ్ళను దానం చేయడం కార్యక్రమం చాలా మంచి కార్యక్రమం అని, మరణానంతరం కళ్ళను వృధా చేయడం కంటే కళ్ళను దానం చేయడం ద్వారా మరొక ఇద్దరికి కంటిచూపుని ప్రసాదించుట ఎంత గొప్ప శుభపరిణామం అని ప్రతి ఒక్కరూ కూడా వారి మరణానంతరం కళ్ళను దానం చేయాలని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో పెనుగొండ ఉపేంద్రరావు, గజ్జల కృష్ణమూర్తి, బండారు రామారావు, భూక్యా వీరభద్రం, భాస్కర్‌రావు, రంగనాయకులు, నాగేశ్వరరావు, సరిత, అనుమోలు భాస్కరరావు, చలువాది రమేష్, కవిత, నార్ల నవీన్, పద్మజ, నాగుబండి రామారావు, పోలా శ్రీను, నూకల ప్రసాద్, పెనుగొండ రామారావు, మిట్టపల్లి కిరణ్, కొల్లా రాంబాబు, కొనతాలపల్లి సుబ్బారావు పాల్గొన్నారు.

ఎట్టకేలకు డంపింగ్‌యార్డ్‌కు స్థలం కేటాయింపు

-ప్రజాపక్షం వరుస కథనాలకు స్పందన
-దిద్దుపూడి రెవిన్యూలో 2 ఎకరాలు కేటాయింపు
-పంచనామాను మున్సిపల్ అధికారులకు అందించిన తహశీల్దార్

డంపింగ్ యార్డు సమస్య తీరేదెన్నడో..?

డంపింగ్‌యార్డుకు పరిష్కారమెప్పుడు..?
వ్యర్థాలు తరలింపుకు ఇబ్బందులు

ప్రజాపక్షం/వైరాః ఎట్టకేలకు వైరా మున్సిపాలిటీకి డంపింగ్‌యార్డ్ స్థలాన్ని రెవిన్యూ అధికారులు కేటాయించారు. వైరా మున్సిపాలిటీలో డంపింగ్‌యార్డ్ సమస్యపై ప్రజాపక్షం దినపత్రిక వరుస కథనాలను ప్రచురించిన విషయం పాఠకులకు విధితమే. మున్సిపాలిటీలోని చెత్త, వ్యర్థ పదార్థాలను డంపింగ్ చేయడానికి సరైన వసతి లేక ఎక్కడబడితే అక్కడ డంపింగ్ చేస్తుండటంతో దుర్వాసనలకు ఇటు ప్రజలు, అటు వ్యవసాయ పొలాల్లోని రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ప్రజాపక్షం వరుస కథనాలను ప్రచురిచండంతో మున్సిపల్ అధికారులు, అదనపు కలెక్టర్ పలు ప్రాంతాల్లో స్థలాలను పరిశీలించినప్పటికీ ఉపయోగం లేక అలానే మరుగున పడవేశారు. మరల వరుస కథనాలతో కదిలిన యంత్రాంగం ఎమ్మెల్యే రాందాస్‌నాయక్ ఆదేశాలతో జిల్లా కలెక్టర్ సూచనలతో కొణిజర్ల తహశీల్దార్ అరుణ దిద్దుపూడి రెవిన్యూలో సర్వే నెంబర్ 81లో న్యూలిటిల్ ఫ్లవర్ స్కూల్ వెనుక భాగంలో ఉన్న 2 ఎకరాల ప్రభుత్వ గుట్టను డంపింగ్‌యార్డ్‌కు ఇస్తూ దానికి సంబంధించిన పంచనామా కాపీని వైరా మున్సిపల్ అధికారులకు అందజేశారు. దీంతో ఎట్టకేలకు డంపింగ్‌యార్డ్ లేక ఇబ్బంది పడుతున్న మున్సిపల్ అధికారులకు సమస్య తీరినట్లే అయింది. అయితే ఆ గుట్ట భాగంలో పెద్ద ఎత్తున ప్రభుత్వ భూమి ఆక్రమణకు కూడా గురైందనే చెప్పవచ్చును. పూర్తిస్థాయిలో ఉన్న ప్రభుత్వ భూమిని బయటికి తీస్తే మరింత డంపింగ్‌యార్డ్‌కు స్థలం పెరిగే అవకాశం ఉంది. నూతనంగా బాధ్యతలు చేపట్టిన మున్సిపల్ చైర్‌పర్సన్ డాక్టర్ కాపా చంద్రకళ మురళీకృష్ణ, వైస్ చైర్మన్ కట్ల సంతోష్, పాలకవర్గ సభ్యులు డంపింగ్‌యార్డ్ ఏర్పాటుపై తొలి సమావేశంలో కూడా డంపింగ్‌యార్డ్, పారిశుద్ధ్యంపై చర్చించారు. అయితే స్థలం కేటాయించారు కాని పూర్తిస్థాయిలో డంపింగ్‌యార్డ్‌కు చుట్టూ ఫెన్సింగ్, అక్కడ వాహనాలకు సరైన వసతులు ఏర్పాటు చేసేందుకు మున్సిపాల్ డిఈఏఈని ఆదేశించినట్లు సమాచారం.

రెచ్చిపోతున్న ఇసుక మాఫియా..!

- రాత్రివేళల్లో అక్రమ ఇసుక తవ్వకాలు
- ప్రభుత్వ ఖజానాకు గండి కొడుతున్న అక్రమార్కులు
- అధికారుల మౌనం వెనుక అంతర్యమేమిటో..!

ప్రజాపక్షం/ బోనకల్ ః బోనకల్ మండలంలో అక్రమ ఇసుక రవాణా నియంత్రణ తప్పి బహిరంగ దందాగా మారింది. అనుమతులు లేకుండానే నదులు, వాగులు, చెరువుల నుంచి భారీ యంత్రాలతో ఇసుకను తవ్వి ట్రాక్టర్లు, లారీల ద్వారా నిరంతరం తరలిస్తున్నా అధికారులు మాత్రం కనీస చర్యలు తీసుకోవడం లేదన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. రాత్రివేళల్లో ఇసుక మాఫియా స్వైరవిహారం చేస్తుండగా సంబంధిత అధికారుల పర్యవేక్షణ పూర్తిగా విఫలమైందని స్థానికులు మండిపడుతున్నారు. ప్రతిరోజూ డజన్ల సంఖ్యలో వాహనాలు ఇసుకను తరలిస్తున్నప్పటికీ చెక్‌పోస్టులు, సంబంధిత శాఖల తనిఖీలు కనిపించకపోవడం అనుమానాలకు తావిస్తోంది. ప్రభుత్వానికి భారీ ఆదాయ నష్టం జరుగుతుండగా కొందరు అక్రమార్కులు లక్షలు గడిస్తున్నారనే ఆరోపణలు విన్పిస్తున్నాయి. అక్రమ తవ్వకాల వల్ల నది తీరాలు దెబ్బతిని భూగర్భజలాలు తగ్గే ప్రమాదం ఉందని గ్రామస్తులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. భారీ వాహనాల రాకపోకలతోగ్రామ రహదారులు ధ్వంసమవుతున్నాయని, ప్రమాదాలు పెరుగుతున్నాయని ప్రజలు వాపోతున్నారు. ఈ విషయంపై ఫిర్యాదులు చేసినా స్పందన లేకపోవడంతో అధికారుల నిర్లక్ష్యంపై ప్రజల్లో ఆగ్రహం వ్యక్తమవుతోంది. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి ఇసుక మాఫియాకు అడ్డుకట్ట వేయాలని, అక్రమ ఇసుక తోలకాలు చేపట్టే వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు.

ప్రకృతి వ్యవసాయంపై రైతులకు అవగాహన

ప్రజాపక్షం/వైరాః వైరా మండలం ఖానాపురం రైతువేదిక నందు ప్రకృతి వ్యవసాయంపై రైతులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమం నందు పాల్గొన్న కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్త చైతన్య మాట్లాడుతూ ప్రస్తుతం ఉన్న ఆధునిక యుగంలో రైతులు ప్రకృతి వ్యవసాయం మీద ఆసక్తి చూపాలని కోరడం జరిగింది. రైతులు ఈ సంవత్సరం నుంచి ప్రకృతి వ్యవసాయం చేయాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉందని తెలపడం జరిగింది. అదేవిధంగా వైరా వ్యవసాయ సహాయ సంచాలకులు తుమ్మలపల్లి కరుణశ్రీ మాట్లాడుతూ రైతులకు ప్రభుత్వం నుంచి సహాయ సహకారాలు ఉంటాయని, ప్రకృతి వ్యవసాయం చేయడం రైతులు అలవరచుకోవాలని, దీనివలన ఆరోగ్యం కుదురుపడుతుంది. ఇప్పుడు ఉన్న ప్రస్తుతం కాలంలో ప్రతి ఒక్క మనిషి అనేక రకాల సమస్యల్లో రావడం జరుగుతుంది. ప్రకృతి వ్యవసాయం చేయడం వలన నేల ఆరోగ్యం మనిషి యొక్క ఆరోగ్యం బాగుంపటం దని ప్రతిఒక్క రైతు ప్రకృతి వ్యవసాయం మీద ఆసక్తి చూపాలని సూచించడం జరిగింది. ప్రకృతి వ్యవసాయంలో వైరా మండల వ్యవసాయ అధికారి మయాన్ మంజుఖాన్ పాల్గొనడం జరిగింది. ఈ కార్యక్రమంలో వ్యవసాయ విస్తరణ అధికారి సపవత్ సైదులు, సేంద్రీయ వ్యవసాయం చేసే రైతులు కొప్పుల వెంకటకృష్ణ, తన్నీరు గోపాలరావు, అదేవిధంగా ఖానాపురం సర్పంచ్ బాలాజి, కృషి సఖీలు, అన్నం వెంకటకోటారెడ్డి, షేక్ షబానా, ఖానాపురం గ్రామ రైతులు పాల్గొన్నారు.

డ్రోన్‌లో చింతకాని యువకుడి ప్రతిభ

-రిమోట్ పైలెట్ శిక్షణ పూర్తి చేసిన రామకృష్ణ
-కలెక్టర్ చేతుల మీదుగా సర్టిఫికెట్ అందజేత

ప్రజాపక్షం/చింతకాని : ఖమ్మం జిల్లా మండల కేంద్రమైన చింతకానికి చెందిన నారపోగు రామకృష్ణ వ్యవసాయ రంగంలో సరికొత్త అధ్యయనాన్ని ఆరంభించారు. ఇటీవల కృషి విజ్ఞాన కేంద్రం ద్వారా ఎంపికై హైదరాబాద్‌లోని ప్రొ॥ జయశంకర్ తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ విశ్వ విద్యాలయం ఆధ్వర్యంలో నిర్వహించిన డ్రోన్ రిమోట్ పైలెట్ శిక్షణలో పాల్గొన్నారు. రాజేంద్రనగర్‌లోని పిజెపియు డ్రోన్ అకాడమీ నిర్వహించిన సిద్ధార్థ ప్రయోగ శిక్షణను రామకృష్ణ విజయవంతంగా పూర్తి చేశారు. వ్యవసాయంలో ఆధునీక సాంకేతికతను వినియోగించేందుకు రూపొందించిన ఈ శిక్షణలో డ్రోన్ ద్వారా ఎరువులు, పురుగు మందులు పిచికారి విధానాలు, భద్రత నియమాలు నిర్వహణ తదితర అంశాలపై అవగాహన కల్పించారు. శిక్షణ అనంతరం నిర్వహించిన చివరి పరీక్షల్లో రామకృష్ణ ఉత్తీర్ణత సాధించారు. రిమోట్ పైలెట్ శిక్షణకు సంబంధించి జిల్లా కలెక్టర్ అనుదీప్ దరిశెట్టి చేతుల మీదుగా రామకృష్ణకు సర్టిఫికెట్ అందజేసి అభినందనలు తెలిపారు. ఆధునీక వ్యవసాయ సాంకేతికతను అలవర్చుకుని ఇతరులకు అండగా నిలబడేందుకు తన వంతు కృషి చేస్తానని రామకృష్ణ తెలిపారు. రామకృష్ణ డ్రోన్ శిక్షణ పూర్తి చేయడం పట్ల గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు.

గుర్తు తెలియని వాహనం ఢీకొని వ్యక్తి మృతి

కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టిన పోలీసులు

ప్రజాపక్షం/సత్తుపల్లిః గుర్తుతెలియని వాహనం ఢీకొని వ్యక్తి మృతి చెందిన సంఘటన సత్తుపల్లి మండలం తాళ్లమడ గ్రామ శివారులో బుధవారం చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... సత్తుపల్లి మండలం తాళ్లమడ గ్రామ శివారులో బుధవారం ఉదయం ఓ పాదచారుడిని గుర్తుతెలియని వాహనం ఢీ కొనటంతో అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడి శరీర భాగాలు నుజ్జు నుజ్జు అవటంతో మృతదేహం గుర్తుపట్టడానికి వీలు లేకుండా ఉంది. మృతుడు వయస్సు (55) సంవత్సరాలు ఉండవచ్చని మృతుడి ఒంటి పై బ్లూ కలర్ టీ షర్టు, తెల్ల లుంగీ ధరించి ఉన్నాడని మృతుడి ఆచూకీ లభించకపోవడంతో అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. మృతదేహాన్ని సత్తుపల్లి ప్రభుత్వాసుపత్రికి తరలించారు. మృతుడు ఆచూకీ తెలిసినవారు వెంటనే సత్తుపల్లి పోలీస్ స్టేషన్ 8712659168 నెంబర్ కాల్ చేసి వివరాలు తెలపగలరని సత్తుపల్లి స్టేషన్ హౌస్ ఆఫీసర్ ఓ ప్రకటనలో పేర్కొన్నారు.

సిసి రోడ్డుకు శంకుస్థాపన

ప్రజాపక్షం/ ఎర్రుపాలెం ః ఎర్రుపాలెం మండలం మీనవోలు గ్రామంలో మాజీ కేంద్రమంత్రి, ఎంపి రేణుకాచౌదరి నిధులు రూ.5లక్షలతో నూతనంగా నిర్మిస్తున్న సిసి రోడ్డు పనులకు సర్పంచ్ కోట కన్నమ్మ, మాజీ సర్పంచ్ వేమిరెడ్డి అనురాధ, సీనియర్ కాంగ్రెస్ నాయకులు జవ్వాజి ఆనందరావులు శంకుస్థాపన చేశారు. గ్రామంలో గంగినేని శ్యాంప్రసాద్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో వారు మాట్లాడుతూ ఎర్రుపాలెం మండలంలో రేణుకాచౌదరి గతంలో చేసిన అభివృద్ధి కాక ప్రస్తుతం కూడా అన్ని రంగాల్లో అభివృద్ధికి తోడ్పడుతున్నారన్నారు. సిసి రోడ్డు నిర్మాణానికి నిధులు మంజూరు చేసిన రేణుకాచౌదరికి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ సందీప్‌రెడ్డి, మాజీ సొసైటీ చైర్మన్ గంగినేని సుబ్బారావు, మండల నాయకులు సామినేని చెన్నకేశవరావు, ఆవుల గురుబ్రహ్మం, జిల్లేపల్లి ప్రసాద్, బాధ సత్యనారాయణరెడ్డి, లక్కిరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి, కుడుముల శ్రీనివాస్‌రెడ్డి, మారిపోకు జమలయ్య, ఎడ్లపల్లి భరత్, షేక్.బాజీ, వార్డు సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

రమణారెడ్డికి బెస్ట్ ఎంప్లాయ్ అవార్డు

ప్రజాపక్షం/కూసుమంచి: ఇరిగేషన్ వర్క్ ఇన్స్పెక్టర్‌గా కర్తవ్యనిష్ఠతో సేవలందిస్తున్న పాలేరు గ్రామ వాసి, అయ్యప్ప గురుస్వామిగా సుపరిచితుడైన బజ్జూరి రమణారెడ్డి బెస్ట్ ఎంప్లాయ్ అవార్డు అందుకున్నారు. జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి పంపిన ప్రశంసా పత్రాన్ని బుధవారం టీజీవో రాష్ట్ర అధ్యక్షులు, టీజేఏసీ రాష్ట్ర సెక్రటరీ, డిప్యూటీ సీఈవో ఏలూరు శ్రీనివాసరావు చేతుల మీదుగా రమణారెడ్డి స్వీకరించారు. రమణారెడ్డి ఎలాంటి రిమార్కులు లేకుండా విధులు నిర్వహిస్తూ, రైతులతో కలిసి మెలిసి పనిచేస్తూ, చివరి ఆయకట్టు భూముల వరకు తిరిగి నీటి పంపిణీ సక్రమంగా జరిగేలా కీలకపాత్ర పోషిస్తున్నారు. ప్రభుత్వానికి ఉత్తమ సేవలు అందించినందుకు లభించే అరుదైన సత్కారంగా ఈ అవార్డు లభించిందని అభినందనలు వ్యక్తమయ్యాయి. అసోసియేషన్‌లో అనేక పదవులు నిర్వహిస్తూ ప్రస్తుతం ఇరిగేషన్ శాఖ జిల్లా అధ్యక్షులుగా కొనసాగుతున్న ఆయనకు కలెక్టర్ నుంచి ఈ గౌరవం దక్కడం ఆనందంగా ఉందని పేర్కొన్నారు. ఈసందర్భంగా కూసుమంచి మండలానికి చెందిన వివిధ రాజకీయ పార్టీల నాయకులు, ఉద్యోగ సంఘాల ప్రతినిధులు, స్నేహితులు, పాలేరు గ్రామ ప్రజలు రమణారెడ్డిని ఘనంగా సన్మానించి అభినందనలు తెలిపారు.